


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL  ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి  ఆదివారం 26 సెప్టెంబరు 2021  సంపుటి : 03  సంచిక : 49  పేజీలు : 4  వెల : రూ


## ఇమ్రాన్ ఖాన్‌కు ధీటైన కౌంటర్ ఇచ్చిన ఇండియా

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఇండియా తీవ్రంగా ఖండించింది. కశ్మీర్ సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని ఇమ్రాన్ తన ప్రసంగంలో కోరారు. పాక్ ప్రధాని చేసిన వ్యాఖ్యలకు యూఎన్‌లోని భారత ప్రతినిధి స్నేహ దూబే కౌంటర్ ఇచ్చారు. జమ్మూకశ్మీర్, లడాఖ్‌లు.. ఎప్పటికీ ఇండియాలోనే భాగమని ఆమె స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్, లడాఖ్‌లను ఇండియా నుంచి ఎవరూ వేరు చేయలేరన్నారు. ఉగ్రవాదులకు పాకిస్థాన్ అడ్డాగా మారుతోందని ఆమె ఆరోపించారు. ఉగ్రవాదులను పాక్ పెంచి పోషిస్తున్న విషయాన్ని ప్రపంచ దేశాలు ఓపెన్‌గా అంగీకరిస్తున్నాయని ఆమె అన్నారు. యూఎన్ వాంటెడ్ జాబితాలో ఉన్న ఉగ్రవాదులు ఎక్కువ శాతం పాకిస్థాన్‌లో ఉన్న విషయాన్ని గ్రహించాలని దూబే తెలిపారు. ఉగ్రవాదులకు సపోర్ట్ చేస్తున్న చరిత్ర పాకిస్థాన్‌కు ఉందని ఆమె ఆరోపించారు. ఒసామా బిన్ లాడెన్‌కు పాకిస్థానే ఆశ్రయం ఇచ్చిందన్నారు. ఇప్పటికీ ఆ ఉగ్రవాదిని పాకిస్థాన్ ఓ అమరుడిగా గుర్తిస్తోందన్నారు. పాకిస్థాన్ ఓ అరాచక దేశమని, కానీ ప్రపంచ దేశాలకు భిన్నంగా కనిపించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. పాక్ అవలంబిస్తున్న విధానాల వల్లే ఉగ్రవాదులు పెట్రేగిపోతున్నారని దూబే పేర్కొన్నారు. సుదీర్ఘకాలం నుంచి ఇండియా, పాక్ మధ్య ఉన్న కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు అత్యవసర చర్యలు చేపట్టాలని పాక్ ప్రధాని ఇమ్రాన్ కోరారు. వీడియో లింకు ద్వారా ఆయన యూఎన్ సమావేశాల్లో మాట్లాడారు. భారత్ సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంటోందని, అత్యాధునిక అణ్వాయుధాలను డెవలప్ చేస్తోందని, దీని వల్ల రెండు దేశాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. భారత్‌లో హిందూ తీవ్రవాదం పెరుగుతోందని, దీని వల్ల ముస్లిం జనాభాకు సమస్య వస్తోందని ఇమ్రాన్ ఆరోపించారు.




## మూడు రాష్ట్రాలకు 'గులాబ్' ముప్పు

**తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం**

**ఇది తుఫాన్‌గా మారి ఒడిషా వైపు పయనం**

**నేడు, రేపు కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన**



విశాఖపట్నం/అమరావతి: అల్పపీడన ప్రభావంతో కోస్తాంధ్రలో నేడు, రేపు భారీ వర్షాలు పడనున్నాయి. కాగా, బంగాళాఖాతంలో తుఫాన్ దూసుకురానుంది. తూర్పు మధ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలపడి శుక్రవారం ఉదయం అల్పపీడనంగా మారింది. ఇది క్రమంగా శుక్రవారం రాత్రి బలపడి వాయుగుండంగా మారింది. ప్రస్తుతం ఈ వాయుగుండం గోపాలపూర్‌కు ఆగ్నేయ దిశలో 670 కిమీ, కళింగపట్నానికి 740 కిమీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది తీవ్రవాయుగుండంగా మారి పశ్చిమ వాయువ్య దిశగా పయనించనుంది. ఈ వాయుగుండం క్రమంగా బలపడి శనివారం మధ్యాహ్నానికి తుఫాన్‌గా రూపాంతరం చెందనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి విశాఖపట్నం గోపాల్‌పూర్ మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటనుంది. ఈ తుఫాన్‌కు పాకిస్తాన్ సూచించిన 'గులాబ్' పేరు పెట్టనున్నట్లు అధికారులు తెలిపారు. తుఫాన్ ప్రభావం వల్ల శని, ఆదివారాల్లో తీరం వెంబడి గంటకు 60 నుంచి 790 కిలోమీటర్లు, గరిష్టంగా 80 కి.మీ, సోమవారం 70 నుంచి 80 కి.మీ, గరిష్టంగా 90 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. మత్స్యకారులు సోమవారం వరకు వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ కన్నబాబు సూచించారు.

## భారత్ బంద్‌కు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు; ఆ సమయంలో బస్సులు తిరగవు

కృష్ణా జిల్లా: వ్యవసాయ చట్టాలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా తలపెట్టిన భారత్ బంద్‌కు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బంద్‌లో భాగంగా 26వ తేదీ అర్ధరాత్రి నుంచి 27వ తేదీ 1 గంట వరకు ఆర్టీసీ బస్సులు నడవవు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి నాని తెలిపారు. రైతు సంఘాలు శాంతియుతంగా బంద్‌లో పాల్గొనాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కును కార్పోరేట్ శక్తులకు అమ్మొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.



## రాష్ట్ర అభివృద్ధి శూన్యం.. రాజధాని లేకపోవడం బాధాకరం: అశోక్

అమరావతి: రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ, విద్యా వ్యవస్థ, వైద్య విధాన పరిషత్‌లు పూర్తిగా నాశనమయ్యాయని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్ బాబు వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి శూన్యమని, రాజధాని లేకపోవడం బాధాకరమని అన్నారు. ఎయిడెడ్ వ్యవస్థ రద్దుతో కేంద్రం ఇచ్చే 50 శాతం నిధులు ఆగిపోతాయని చెప్పారు. ప్రభుత్వానికి అప్పగించమని చెప్పిన 12 కాలేజీల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 12 కాలేజీల లెక్చరర్లకు రఘురామకృష్ణరాజుకు ఇచ్చినట్లుగా కౌన్సలింగ్ ఇవ్వడం బాధాకరమన్నారు. ఎయిడెడ్ కాలేజీల స్థలాలు, వాటి ఆస్తులను స్వాధీనం చేసుకొని అన్యాయానికి పాల్పడాలన్నది ప్రభుత్వ ఉద్దేశం అని ఆయన తెలిపారు. 9వేల మంది టీచింగ్ స్టాఫ్, 5 వేల నాన్ టీచింగ్ స్టాఫ్‌ని ప్రభుత్వం తీసుకుంటే పనిచేస్తున్నవారు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. కొత్త ఉద్యోగాలు భర్తీ చేయడంలేదని అన్నారు.

## పూర్తయిన జెడ్పీ ఛైర్మన్ల ఎన్నిక

**ఆయా జిల్లాల్లో జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం**

**జిల్లా పరిషత్ కార్యాలయాల్లో జెడ్పీటీసీ సభ్యులు ప్రమాణ స్వీకారం**






విజయవాడ, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)నూతనంగా ఎన్నికైన 62 జడ్పీటీసీల ప్రమాణస్వీకారం పూర్తి అయింది. జడ్పీ కో–ఆప్షన్ సభ్యులుగా ఫయాజ్ వలి, అహ్మద్ బాషా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి శంకర్ నారాయణ, ప్రభుత్వ విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనంతవెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, డాక్టర్ సిద్ధారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఏపీ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీం అహ్మద్, ఏపీ నాటక అకాడమీ ఛైర్ పర్సన్ హరిత పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ వద్ద వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల కోలాహలం నెలకొంది. మొత్తం 38 స్థానాలకు గాను 36 మంది జడ్పీటీసీ అభ్యర్థులు వైఎస్సార్సీపీ తరపున విజయం సాధించారు. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్ పదవులు కూడా వైఎస్సార్‌సీపీ దక్కించుకుంది. ఈ సందర్భంగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ.. ఇదంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందించిన విజయంగా పేర్కొన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు మాట్లాడుతూ.. ముఖ్యంగా ఈ సారి జడ్పీ ఛైర్ పర్సన్ పదవి గిరిజన ప్రాంతానికి దక్కడంతో సంతోషంగా ఉందన్నారు.

వైఎస్సార్ కడప జిల్లా పరిషత్ కో అప్షన్ సభ్యులుగా ఇద్దరు మైనారిటీలకు అవకాశం.

కరీముల్లా, షేక్ అన్వర్ బాష లను కో అప్షన్ మెంబర్లుగా ఏకగ్రీవ ఎన్నిక. ప్రకటించిన జిల్లా కలెక్టర్ విజయరామ రాజు.

జిల్లాల వారీగా జడ్పీ ఛైర్మన్‌గా ఎన్నిక కానున్నది వీరే..

అనంతపురం జిల్లా: బోయ గిరిజమ్మ (బీసీ)

చిత్తూరు జిల్లా: శ్రీనివాసులు ( బీసీ)

తూర్పు గోదావరి జిల్లా: వేణుగోపాల్ రావు (ఎస్సీ)

పశ్చిమ గోదావరి జిల్లా: కవురు శ్రీనివాస్ (బీసీ)

గుంటూరు జిల్లా: హెనీ క్రిస్టినా( ఎస్సీ)

కర్నూలు జిల్లా: వెంకట సుబ్బారెడ్డి( ఓసీ)

కృష్ణా జిల్లా: ఉప్పాళ్ల హారిక( బీసీ)

నెల్లూరు జిల్లా: ఆనం అరుణమ్మ( ఓసీ)

ప్రకాశం జిల్లా: వెంకాయమ్మ (ఓసీ)

వైఎస్సార్ కడప జిల్లా: ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి (ఓసీ)


విశాఖపట్నం జిల్లా: జల్లిపల్లి సుభద్ర (ఎస్టీ)

విజయనగరం జిల్లా: మజ్జి శ్రీనివాసరావు (బీసీ)

శ్రీకాకుళం జిల్లా: విజయ( సూర్య బలిజ)

మధ్యాహ్నం 3 గంటకు జడ్పీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరగనుంది. జడ్పీ ఎన్నికలకు ప్రిసైడింగ్ అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. కలెక్టర్లు జడ్పీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్‌తో ప్రమాణం చేయుంచనున్నారు. డప నగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి జడ్పీ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నేతలు భారీ ర్యాలీ చేపట్టారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఎన్నిక కానున్న ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. అంతకుముందు మహానేత దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి సీఎం అంజాద్ బాష, చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మేడా మల్లికార్జున్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ పాల్గొన్నారు. కృష్ణా జిల్లాలో జడ్పీ ఛైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. బీసీ మహిళ జడ్పీ పీఠాన్ని అధిష్టించనున్నారు. 13 జిల్లాల్లో చైర పర్సన్, ప్రతి జిల్లాకు ఇద్దరు వైస్ చైర్ పర్సన్లకు ఎన్నిక జరగనుంది. 13 జిల్లా పరిషత్‌లు వైఎస్సార్‌సీపీ ఖాతాలోనే పడనున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు 50 శాతానికిపైగా పదవులు దక్కనున్నాయి. నూరుశాతం జడ్పీ పీఠాలను కైవసం చేసుకోవడం దేశంలోనే ఇదే ప్రథమం.

## ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో మనం మరింత పురోగతిని చూడాలి: అమిత్ షా




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన సహకార శాఖ మంత్రి ఇవాళ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ శాఖ ఆధ్వర్యంలో ఇవాళ సహకార సంస్థల మెగా సదస్సు జరుగుతోంది. ఈ సదస్సులో భాగంగా దేశ వ్యాప్తంగా వివిధ సహకార సంఘాలకు చెందిన 8 కోట్ల మంది సభ్యులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడనున్నారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ సమావేశం జరగుతుండగా.. ఈ కాన్ఫరెన్స్‌ను సహకార సంస్థలు ఎఈఈఅూ, నేషనల్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అమూల్, సహకార భారతి, ఔంఈఇఆ, ఐఖీఎఃఊఅూతోపాటు ఇతర సంస్థలు నిర్వహిస్తుండటం విశేషం. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో మనం మరింత పురోగతిని చూడాల్సిన అవసరం ఎంతో ఉందని సహకారశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. ఇఫ్కో 1966 లో 77 సొసైటీలతో ప్రారంభమైందని చెప్పిన ఆయన.. ఇఫ్కోలో ప్రస్తుతం 3.5 కోట్ల మంది రైతులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. మరింత మంది రైతులు దీనిలో పాలుపంచుకుంటేనే మంచి ఫలితాలు సాధించగలమని అమిత్ షా పేర్కొన్నారుదేశంలో సహకార రంగాన్ని ఆధునీకరించి శాస్త్రీయంగా మార్చాల్సిన అవసరం ఉందని మంత్రి అమిత్ షా చెప్పారు. అందుకే కేంద్రం సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఇక మీదట రైతుల రుణాలలో 25 శాతం సహకార రంగంలోనే నిర్వహించబడతాయని చెప్పారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అత్యంత ఆవశ్యకమన్న అమిత్ షా.. ఈ రంగం వి 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను కలిగి ఉందన్నారు. గ్రామీణాభివృద్ధి దేశాభివృద్ధికి ఈ రంగం ఎంతో దోహదపడుతుందని కేంద్ర సహకార మంత్రిత్వశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. సహకార రంగాన్ని దేశంలోని అన్ని ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు అమిత్ షా. సహకారాన్ని మన వ్యక్తిత్వ లక్షణంగా తీసుకురావాలని అమిత్ షా పేర్కొన్నారు. కేంద్ర సహకార శాఖ ఆవశ్యకతను ప్రశ్నించిన విపక్ష నేతలకు కేంద్రమంత్రి అమిత్ షా సభా ముఖంగా సమాధానమిచ్చారు. దేశంలో తుఫాను, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుని దేశ గ్రామీణ ప్రజలు తట్టుకునేందుకు సహకార రంగం చాలా దోహదపడిందని అమిత్ షా చెప్పారు. 1947 సహకార రంగం దేశంలో పరిఢవిల్లుతోందని అమిత్ షా అన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీ జయంతి రోజు ఈ సభ జరుగుతుండటం సంతోషకరందేశంలో అగ్రశ్రేణి రాజకీయ నేత పండింట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీ జయంతి రోజున ఈ సహకార సదస్సు జరుగుతుండటం చాలా ఆనందకరంగా ఉందని కేంద్ర మంత్రి అమిత్ షా అన్నారు.

## ఏపీ, తెలంగాణల్లో నాలుగు గుర్తులకు నో

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల గుర్తులను సవరిస్తూ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఎన్నికల సంఘం జాతీయ, రాష్ట్ర పార్టీలకు శాశ్వత గుర్తులు కేటాయించింది. ఎన్నికల సంఘం గుర్తింపు లేని పార్టీల కోసం కేటాయించే ఫ్రీ సింబల్స్ విషయంలో కొన్ని ఆంక్షలను విధించింది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఆయా రాష్ట్రాల్లో పలు గుర్తులను ఉపయోగించకుండా ఉండేలా చర్యలు తీసుకుంటూ తాజా ఉత్తర్వులు జారీచేసింది. అందులో భాగంగా ఆటోరిక్షా, టోపీ, ఇస్త్రీ పెట్టె, ట్రక్కు గుర్తులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వినియోగించుకోకుండా ఆంక్షలు విధించింది. ఈ గుర్తులను ఏపీ, తెలంగాణ మినహా దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. కాగా, గతంలో జనసేనకు కేటాయించిన గ్లాసు గుర్తును ఫ్రీ సింబల్స్ కేటగిరీలో ఉంచింది.




**మరో నినాదాన్ని తెరపైకి తెచ్చిన జేసీ దివాకర్‌రెడ్డి...**

## ఏపీలో సరికొత్త చర్చ

హైదరాబాద్: జేసీ దివాకర్ రెడ్డి పేరు పరిచయం అక్కరలేని నేత. ఉమ్మడి ఆంధ్రప్రేదశ్ నుంచి సంచనల రాజకీయాలు చేయడంలో దిట్ట.. నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రి వర్గంలో పనిచేసిన జేసీ.. రాష్ట్ర విభజనతో రాజకీయ ప్రభావం కోల్పోతున్నారు. అలాంటి జేసీ తెలంగాణ అసెంబ్లీకి వచ్చి తన పాత మిత్రులతో సరదాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. తన హాట్ హాట్ కామెంట్లతో తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఇరకాటంలో పడేస్తున్నారు. అసెంబ్లీకి వచ్చిన మాజీమంత్రి జేసీ దివాకర్ రెడ్డి..లాబీలో సీఎం కేసీఆర్‌ను కలిశారు. రాయల తెలంగాణ కావాలని జైపాల్ రెడ్డిని అడిగితే ఒప్పుకోలేదన్నారు. తమ సొంత రాష్ట్రంలో రాజకీయాలు బాగాలేవని, సమాజం కూడా బాగాలేదని జేసీ వ్యాఖ్యానించారు. ఆ తర్వాత సీఎల్పీ కార్యాలయంలో వెళ్లి కాంగ్రెస్ నేతలతో ముచ్చటించారు. ఆంధ్రప్రదేశ్‌ను వదిలేసి తెలంగాణకు వస్తానని జేసీ హాట్ కామెంట్ చేశారు. విభజన సమయంలో తెలంగాణను వదిలిపెట్టి చాలా నష్టపోయామన్నారు. అయితే గతంలో ఓసారి అసెంబ్లీకి వచ్చిన సందర్భంలో జేసీ దివాకర్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో కాసేపు ముచ్చటించారు. తెలంగాణ కాంగ్రెస్ శాసనసభాపక్ష కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు రాజగోపాల్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో జేసీ సరదాగా మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ భవిష్యత్తు గురించి తన అభిప్రాయాలను ఆ నేతలతో జేసీ మొహమాటం లేకుండా మాట్లాడారు. నాగార్జున సాగర్ ఉప ఎన్నిక గురించి కూడా స్పందించారు. టీడీపీ నేతగా ఉండి జేసీ కాంగ్రెస్ ను సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు.

# సంపాదకీయం

ఆదివారం 26 సెప్టెంబరు 2021

## మాంసం..పాలు కూడా గ్లోబల్ వార్మింగ్‌కు కారణాలు

గ్లోబల్ వార్మింగ్‌కు కార్బన్ ఉద్గారాలు కూడా కారణమవుతాయి. గ్లోబల్ వార్మింగ్ అంటే ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రత పెరగడం. కర్బన ఉద్గారాలపై శాస్త్రవేత్తల కొత్త పరిశోధనగ్రాబ్బంతికరంగా ఉంది. మాంసం, పాల ఉత్పత్తులు మొక్కల నుండి తయారు చేసిన ఆహారం కంటే రెట్టింపు కార్బన్‌ను విడుదల చేస్తాయని పరిశోధన చెబుతోంది. ఇది పర్యావరణానికి మంచిది కాదు. పెరుగుతున్న కర్బన ఉద్గారాలతో, గ్రీన్‌హౌస్ వాయువుల స్థాయి పెరుగుతుంది. పరిస్థితి ఇలాగే ఉంటే, అప్పుడు వేడి మరింత పెరుగుతుంది. అమెరికాలోని ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు తమ ఇటీవలి పరిశోధన ద్వారా ఈ విషయాన్ని బయటపెట్టారు. మొదటగా శాస్త్రవేత్తలు 200 దేశాలలో పరిశోధనలు చేసి ఆహార పదార్థాల నుండి కార్బన్ ఉద్గారాల సంబంధాన్ని అర్థం చేసుకున్నారు. ఈ దేశాలలో పెరిగిన 171 పంటలను, జంతువుల నుండి తయారు చేసిన 16 ఉత్పత్తులను పరీక్షించారు. జంతువుల నుండి వచ్చే మాంసం, పాల ఉత్పత్తుల నుండి 57 శాతం వరకు కార్బన్ ఉద్గారాలు వస్తున్నాయని పరిశోధన నివేదిక వెల్లడించింది. అదే సమయంలో, కేవలం 29 శాతం కార్బన్ ఉద్గారాలు మొక్కల ఆధారిత ఆహారం నుంచి ఉత్పత్తి అవుతాయి. ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుడు అతుల్ జైన్ ఇలా చెబుతున్నారు.. "మొత్తం గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో 33 శాతం వరకు ఆహార ఉత్పత్తి కారణమని మా అధ్యయనం చూపిస్తుంది. దీనికి మనిషి బాధ్యత వహిస్తాడు. ప్రపంచంలో గొడ్డు మాంసం ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది అత్యంత కాలుష్యకరమైన ఆహారం. దీని తరువాత ఆవు పాలు, పంది మాంసం ఉన్నాయి. గ్రీన్‌హౌస్ వాయువులు ప్రధానంగా ఉష్ణోగ్రత పెరుగుదలకు బాధ్యత వహిస్తాయి. వాతావరణంలో 6 ప్రధాన గ్రీన్‌హౌస్ వాయువులు ఉన్నాయి. వీటిలో కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, హైడ్రోఫ్లోరోకార్బన్స్, పెర్ఫ్లోరోకార్బన్స్ , సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్ ఉన్నాయి. వీటిలో కార్బన్ ఉద్గారాలు కూడా ఉన్నాయి. ఈ వాయువులు భూమి యొక్క ఉష్ణోగ్రతను ఎలా పెంచుతున్నాయనే విషయాన్ని పరిశీలిస్తే.. వాస్తవానికి, ఈ వాయువులు వాతావరణంలో పెరుగుతున్నందున, అవి మందపాటి పొరలా మారుతున్నాయి. ఇవి అధిక వేడిని బయటకు పోకుండా నివారిస్తాయి. ఫలితంగా భూమి ఉష్ణోగ్రత పెరుగుతోంది. వాతావరణ మార్పు సమస్యను పెంచడానికి ఎర్ర మాంసం పనిచేస్తుందని సూచించే ఆధారాలు ఉన్నాయని నేచర్ ఫుడ్ జర్నల్‌లో ప్రచురించిన పరిశోధన పేర్కొంది. 2016 లో, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ ద్వారా ఒక అధ్యయనం వచ్చింది. ప్రపంచంలోని మొత్తం జనాభా మాంసాహారానికి బదులుగా శాకాహార ఆహారాన్ని తినడం మొదలుపెడితే, 2050 నాటికి, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను 70%వరకు తగ్గించవచ్చని ఆ అధ్యయనం పేర్కొంది. ప్రపంచంలోని ఒక అంచనా ప్రకారం 12 బిలియన్ ఎకరాల భూమి వ్యవసాయ సంబంధిత పనుల కోసం ఉపయోగించబడుతుంది. ఇందులో 68% భూమి జంతువుల కోసం ఉపయోగించబడుతుంది. అందరూ శాకాహారులుగా మారితే, 80% భూమి జంతువులు, అడవుల కోసం ఉపయోగించడం జరుగుతుంది. ఇది కార్బన్ డయాక్సైడ్ మొత్తాన్ని తగ్గిస్తుంది. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. మిగిలిన 20% భూమిని వ్యవసాయానికి ఉపయోగించవచ్చు. కాగా, ప్రస్తుతం సాగు చేస్తున్న భూమిలో మూడింట ఒక వంతు జంతువులకు మేతగా సాగు చేస్తున్నారు.

# కేశినేని రాజకీయాలకు గుడ్ బై



విజయవాడ, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)బెజవాడ టీడీపీకి సైకిల్ రైడర్ కావలెను.. అవును మీరు విన్నది నిజమే.. ప్రస్తుతం ఎంపీగా ఉన్న కేశినేని నాని పార్టీ నుంచి మెల్లిమెల్లిగా సైడవుతున్నారు. త్వరలోనే రాజకీయాలకు కూడా గుడ్‌బై చెప్పబోతున్నారు. ఇంతకీ ఆయన నిర్ణయం వెనుక మతలబేంటి? అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. కేశినేని నాని.. విజయవాడ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన లీడర్. ట్రావెల్ బిజినెస్ నుంచి అంచెలంచెలుగా నాయకుడిగా ఎదిగాడు. టీడీపీ నుంచి రెండుసార్లు ఏంపీగా పోటీ చేసి గెలుపొందారు. రాష్ట్రమంతా వైసీపీ గాలి వీచినా తాను మాత్రం ఎదురొడ్డి బెజవాడలో విజయదుందుబీ మోగించారు. ఆ తర్వాత నానితో పాటు ఆయన కూతురు కూడా పాలిటిక్స్‌లో యాక్టివ్ అయ్యారు. రీసెంట్‌గా జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం శతవిధాలా ప్రయత్నించారు కేశినేని నాని. మరోవైపు సైకిల్ దిగి కమలం గూటికి చేరుతారనే టాక్ వినిపించింది. కానీ నాని మాత్రం నో కామెంట్ అంటూ దాటవేశారు. పార్టీ మార్పుపై ఎప్పుడు ఎక్కడా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. అయితే కొంతకాలంగా టీడీపీ ఆఫీస్‌కి దూరమయ్యారాయన. నిజానికి రాజకీయాలకు దూరంగా ఉండాలని గత ఎన్నికలకు ముందే నాని నిర్ణయం తీసుకున్నారు. అధినేత చంద్రబాబు సూచన మేరకు పోటీ చేసి రెండోసారి కూడా విక్టరీ కొట్టారు. కొద్దిరోజులుగా పార్టీకి, నియోజకవర్గానికి దూరంగా ఉండడంతో కేశినేని టాపిక్ బెజవాడ సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారింది. సైకిల్ దిగననంటూనే రాజకీయాలకు దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. డబ్బు, పదవులపై ఎలాంటి ఆశలేదని.. వచ్చే నిధులతో తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. ఆయన కూతురు శ్వేత చౌదరి టాటా ట్రస్ట్‌లోకి వెళ్లిపోయింది. దీంతో తండ్రీబిడ్డలిద్దరూ నెక్ట్స్ ఎలక్షన్‌లో పోటీ చేయబోరని తేలిపోయింది. పాలిటిక్స్‌కి దూరంగా ఉండడంపై ఇప్పటికే చంద్రబాబుకు సమాచారమిచ్చారు కేశినేని నాని. అలాగే వచ్చే ఎన్నికల్లో తన ప్లేస్‌లో వేరే అభ్యర్థిని కూడా చూసుకోవాలని చెప్పారట. ప్రస్తుతానికి నాని సిమ్లాలో ఉన్నారు. మరిప్పుడు ఆయన ప్లేస్‌లో బెజవాడలో సైకిల్‌పై సవారీ చేసేదెవరన్న చర్చ జోరుగా నడుస్తోంది.

# వైసీపీలో మరో రఘురాముడు

రాజమండ్రి, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)రాజకీయాలు ఒకసారి రుచి చూసిన తర్వాత ఎవరూ అంత సులువుగా వదలరు. ఓటమి పాలయినా రాజకీయాల్లో కొనసాగుతారు తప్ప మరో దారి పట్టరు. పాలిటిక్స్ లో అంత కిక్కు ఉంటుంది మరి. రాజమండ్రి పార్లమెంటు సభ్యుడు మార్గాని భరత్ ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారాడు. ఆయన మరో ఖీఖీఖీ అంటూ సొంత పార్టీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. తనపై చేసిన ఆరోపణలపై మార్గాని భరత్ నేరుగా సీఎంను కలిసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎంపీ మార్గాని భరత్ ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ ను కోరినట్లు తెలిసింది. తనపై దారుణమైన ఆరోపణలను జక్కంపూడి రాజా చేశారని మార్గాని భరత్ అంటున్నారు. జగన్ ను జైలుకు పంపిన జేడీ లక్ష్మీనారాయణతో సెల్ఫీ దిగినట్లు అన్నారని, నిరూపిస్తే ఎటువంటి శిక్షకైనా సిద్ధమని మార్గాని భరత్ సవాల్ విసురుతున్నారు. ఒక కాపు సామాజికవర్గం సమావేశానికి తాను హాజరుకాగా, జేడీ లక్ష్మీనారాయణ వచ్చారని, ఆయనే తన వద్దకు వచ్చి మాట్లాడరని భరత్ అంటున్నారు. జేడీ లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రి జగన్ పాలనను ఆయన మెచ్చుకున్నారని మార్గాని భరత్ చెబుతున్నారు. తాను ఆయనవద్దకు వెళ్లి ఫొటోలు దిగలేదని, కావాలంటే వీడియో ఫుటేజీ పరిశీలించుకోవచ్చని చెబుతున్నారు. మరోవైపు తాను గోరంట్ల బుచ్చయ్య చౌదరి, పెందుర్తి వెంకటేష్ లతో కలసి రాజకీయాలు చేస్తున్నానని ఆరోపించారని, దీనిపై ఆధారాలుంటే తాను ఎలాంటి శిక్షకైనా సిద్ధమని అన్నారు. తనకు జగన్ జీవితంలో మర్చిపోలేని అవకాశమిచ్చారని అలాంటిది జగన్ ను మోసం చేస్తానని ఎలా అనుకున్నావని మార్గాని భరత్ ప్రశ్నించారు. తాను జీవితాంతం జగన్ వెంటే నడుస్తానన్నారు. తనను జగన్ తమ్ముడు లాగా చూసుకుంటానని, తాను ఎన్నడూ జగన్ పై అలగలేదని

కూడా మార్గాని భరత్ అన్నారు. తనపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారమని చెప్పడానికి ఎంపీ మార్గాని భరత్ జగన్ ను కలవాలని నిర్ణయంచుకున్నారు. అధిష్టానం తనను పిలవకపోయినా నేరుగా తానే కలసి దీనిపై వివరణ ఇవ్వాలని మార్గాని భరత్ భావిస్తున్నారు. వీలయినంత త్వరగా జగన్ ను కలిసేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. అయితే రాజమండ్రిలో జరుగుతున్న రచ్చపై జగన్ ఇప్పటికే నివేదిక తెప్పించుకున్నట్లు తెలిసింది. రాజమండ్రిలో రచ్చకు గల కారణాలపై జగన్ ప్రత్యేకంగా నివేదిక తెప్పించుకున్నారంటున్నారు. మొత్తం మీద రాజమండ్రిలో ఇద్దరి యువనేతల మధ్య విభేదాలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా ఉన్నాయి.

# పీకల్లోతు కష్టాల్లో జామ రైతులు



విజయవాడ, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్) జామ ధర ఏ మాత్రమూ గిట్టుబాటు కావడం లేదు. దీంతో, జామ రైతులు నష్టాల పాలై ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. బయట మార్కెట్లో కిలో జామ కాయలకు రూ.40కుపైగా ధర పలుకుతున్నా రైతుల నుంచి దళారులు రూ.3.50కు మించి కొనడం లేదు. కోత కూలి కూడా రాని పరిస్థితుల్లో కొందరు రైతులు కాయలను కోయకుండా చెట్లకే వదిలేస్తున్నారు. ఇంకొందరు తోటలను తొలగిస్తున్నారు. నూజివీడు, విస్సన్నపేట, ముసునూరు, ఆగిరిపల్లి, బాపులపాడు, గన్నవరం, అవనిగడ్డ, నాగాలయలంక, మైలవరం తదితర మండలాల్లో 35 వేల ఎకరాల్లో జామ తోటలు ఉన్నాయి. ఎరువులు, పురుగు మందులు, తెగుళ్ల మందులు, కలుపు తీతకు వంటి పనులకు ఏటా సగటున ఎకరానికి రూ.40 వేల చొప్పున పెట్టుబడి అవుతోంది. రెండు విడతలుగా ఎకరానికి పది టన్నులు దిగుబడులు వస్తాయి. టన్ను జామకు రైతులకు రూ.3,500కు మించి ధర లభించడం లేదు. పది టన్నులకు రూ.35 వేలు మాత్రమే వస్తోంది. ఎకరం ఒక్కంటికీ ఐదు వేల రూపాయల చొప్పున నష్టపోతున్నాడు. జిల్లాలో విజయవాడ, మచిలీపట్నం నగరాలతోపాటు గుడివాడ, నూజివీడు, పెడన, జగ్గయ్యపేట, కొండపల్లి, తాడిగడప మున్సిపాల్టీల్లోనూ, తిరువూరు, ఉయ్యూరు, నందిగామ నగర పంచాయతీల్లోనూ జామ కాయలు కిలో రూ.40కు, షాపింగ్ మాల్స్‌లో ఒక్కొక్క కాయను పది రూపాయలకు విక్రయిస్తున్నారు. రైతులకు మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదు. దీంతో, కొందరు రైతులు ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి శ్రద్ధగా పెంచిన తోటలను తొలగిస్తున్నారు. ఎంకీ వీర్రాజు, యమర్తి తంగిడయ్య, గూడూరు సాంబశివరావు తమకు గొల్లపల్లి గ్రామంలోగల పది ఎకరాల్లోని జామ తోటలను తొలగించారు. నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన యలర్తి నర్సయ్య తన రెండెకరాల్లోని తోటలో, ఎం.వీర్రాజు తనకున్న మూడు ఎకరాల్లోని తోటలో కాయలను కోయకుండానే వదిలేశారు.. దీంతో, తోటల్లోనే కాయలు రాలిపోతున్నాయి. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇవే పరిస్థితులు ఉన్నాయి. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని జామ రైతులు ఆవేదన చెందుతున్నారురాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు రెండు నెలల క్రితం నూజివీడు వచ్చిన సందర్భంలో ఈ సమస్యను ఆయన దృష్టికి జామ రైతులు తీసుకెళ్లారు. ఎపి అగ్రికల్చర్ మిషన్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డిని ఆయన ఇంటి వద్ద కలిసి వినతిపత్రం సమర్పించారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు పలుమార్లు విన్నవించారు. టన్ను రూ.15 వేలు ఇవ్వనిదే గిట్టబాటు కాదని తెలిపారు. పల్ప్ ఫ్యాక్టరీలతో మద్దతు ధర ఇప్పించాలని కోరారు. అయినా, ఫలితం లేకుండా పోయిందిమూడేళ్ల క్రితం టన్ను కాయలకు కంపెనీలు రూ.17 వేలు ఇచ్చాయి. లాభసాటిగా ఉంటుందని ఉన్న రెండెకరాల్లో జామ సాగు చేశా. రెండేళ్లు వ్యయ ప్రయాసకోర్చి పెంచితే తోట కాపుకు వచ్చింది. ఏటా రూ.40 వేలు పెట్టుబడి పెడితే పది టన్నులు దిగుబడులు వస్తాయి. నా తోట కాపుకొచ్చినప్పటి నుంచి ఒక్కసారి కూడా గిట్టుబాటు ధర రాలేదు. ప్రస్తుతం టన్ను కాయలను రూ.3,500కు అడుగుతున్నారు. కోత కూలి కూడా రాదని కాయలు కోయకుండానే వదిలేశాను.

# రైతులకు డీఏపి కష్టాలు

ఏలూరు, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)ఇటు ప్రభుత్వం అటు ప్రైవేటు డీలర్లు ఇరువురి వద్ద డి- అమ్మోనియం ఫాస్ఫేట్ (డిఎపి) ఎరువు నిల్వలు మొత్తానికే అయిపోయాయని తెలుస్తోంది. ప్రస్తుతం జీరో బ్యాలెన్స్ అని చెబుతున్నారు. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఒపి)కు సైతం తీవ్ర కొరత నెలకొందని సమాచారం. కేంద్రంతో మాట్లాడి అవసరమైన ఎరువులను తెప్పించి రైతులను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రయత్నం చేయకుండా డిఎపికి బదులు కాంప్లెక్స్ ఎరువులు వినియోగించాలని రైతులకు సలహా ఇస్తోంది. కాగా ఎరువుల్లో యూరియా తర్వాత ఒక్క డిఎపి ధరే కొంచెం తక్కువగా ఉండటంతో రైతులు దాని కోసం వెతుకులాడుతున్నారు. గ్రామాల్లో సర్కారు నిర్వహిస్తున్న రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)లో, బయట ప్రైవేటు మార్కెట్‌లో డిఎపి దొరక్క నానా యాతన పడుతున్నారు. ఈ సంవత్సరం నైరుతి రుతుపవన కాలంలో చాలా ప్రాంతాల్లో వర్షానికి, వర్షానికి మధ్య అంతరాల కారణంగా పంటల సేద్యం ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్న చందాన సాగుతోంది. జులై పదిహేను తర్వాతనే సేద్యం ఒకింత మొదలైంది. ఆగస్టులో కాస్త ఊపందుకోవడంతో ఆ నెల చివరి నుండి సెప్టెంబర్‌లో పంటల ఎదుగుదలకు ఎరువులు అవసరమయ్యాయి. ఒకేసారి ఎరువులకు డిమాండ్ ఏర్పడిన దరిమిలా కొరత ఏర్పడింది. ఈ పరిస్థితులను ప్రభుత్వం ముందస్తుగా అంచనా వేయకపోవడంతో అదనుకు రైతులకు ఎరువులు దొరకని పరిస్థితి నెలకొంది. కొరత లేదని వ్యవసాయశాఖ చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. గతంలో ప్రభుత్వం ఒక్క యూరియాను మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా అమ్మించేది. ఈ తడవ డిఎపి కేటాయింపుల్లో 70 శాతం వరకు ప్రభుత్వమే తీసుకొని విక్రయించేందుకు ప్రయత్నించిందని చెబుతున్నారు. ఆర్‌బికెలలోకానీ, ప్రైవేటు డీలర్ల వద్దకానీ ప్రస్తుతం డిఎపి స్టాక్స్ లేవని సమాచారం. ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన ఎరువుల్లో కేంద్రం నుండి రాష్ట్రానికి తక్కువ వచ్చాయి. డిఎపి 2.5 లక్షల టన్నులు అవసరమని అంచనా వేయగా నిరుడు మిగిలిన పాత స్టాక్స్‌తో కలిపి 2.09 లక్షల టన్నులే వచ్చాయి. 41 వేల టన్నులు రానేలేదు. ఎంఒపి 17 వేల టన్నులు తక్కువ వచ్చాయి. యూరియా సైతం 19 వేల టన్నులు తక్కువ వచ్చాయి. ఆర్‌బికెలలో ఎరువుల అమ్మకాల కోసం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నిర్ణయించి 1.5 లక్షల టన్నులు సేకరించారు. యూరియా లక్ష టన్నులు, డిఎపి 15 వేల టన్నులు, కాంప్లెక్స్ 25 వేల టన్నులు, ఎంఒపి 10 వేల టన్నులు సేకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,724 ఆర్‌బికెలలో 2 లక్షల టన్నుల ఎరువులను అమ్మాలనుకోగా పాత స్టాక్స్‌తో కలిపి 1.8 లక్షల టన్నులు అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు 1.1 లక్షల టన్నులు విక్రయించామంటున్నారు. డిఎపికి బదులు '20-20, 28-28' కాంప్లెక్స్ ఎరువులను వాడుకోవాలని రైతులకు సలహాలివ్వాలని ఆర్‌బికెల ఇన్‌ఛార్జిలకు మౌఖిక ఆదేశాలిచ్చినట్లు సమాచారం. అయితే రైతులు అందుకు అంగీకరించట్లేదు. అందుక్కారణం డిఎపి వాడేందుకు అలవాటు పడటం, కాంప్లెక్స్ ఎరువుల కంటే డిఎపినే తక్కువ ధర కావడం. అంతర్జాతీయంగా ముడి సరుకుల ధరల్లో హెచ్చు తగ్గులు, కేంద్రం డీజిల్, పెట్రోల్ రేట్ల పెంపు, కరోనా సంక్షోభం, ఇత్యాది కారణాల వలన ఈ ఏడాది ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. '28-28..' ధర 50 కిలోల బస్తా గతంలో రూ.1,100 ఉండగా ఇప్పుడు రూ.1,550 అయింది. '20-20..' ధర గతంలో రూ.800-850 ఉండగా ఇప్పుడు 1,275 అయింది. సబ్సిడీ పోను ఒక్క డిఎపి ఎంఆర్‌పి మాత్రమే రూ.1,200 ఉంది. ధర తక్కువ కావడంతో రైతులు డిఎపి వైపు అనివార్యంగా మళ్లుతున్నారు.

# నిలబడడానికి దారేదీ


విజయవాడ, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)ప్రజాసమస్యలు ఎక్కడుంటే వామపక్షాలు అక్కడ ఉంటాయి. ప్రజల వెంట నిరంతరం పయనిస్తుంటాయి. అదే ఆ పార్టీలకు ప్లస్ పాయింట్. బలమైన క్యాడర్ ఉన్న వామపక్ష పార్టీలు ఇప్పుడు ఏపీలో క్రాస్ రోడ్స్ లో ఉన్నాయి. ఎటూ వెళ్లలేని పరిస్థితిని కొని తెచ్చుకున్నాయి. ఒంటరిగా పోటీ చేసే పరిస్థితి ఆ పార్టీలు ఏనాడో కోల్పోయాయి. దీంతో వచ్చే ఎన్నికలకు ఎవరితో కలసి నడుద్దామనుకున్నా వారికి దారి దొరకడం లేదు. వామపక్ష పార్టీలు దశాబ్దకాలం క్రితం వరకూ కొంత రాజకీయాలను శాసించాయి. అయితే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత సీపీఐ, సీపీఎంలు మరింత క్షీణించాయి. తమకు పట్టున్న ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో సయితం ఇప్పుడు ప్రభావం చూపే అవకాశం కన్పించడం లేదు. వామపక్ష భావాజాలాన్ని నమ్మి రాజకీయాల్లోకి వచ్చే వారి సంఖ్య ఇటీవల కాలంలో చాలా తక్కువయింది. ఉన్న క్యాడర్ కూడా తమ బతుకు పోరాటం కోసం ఇతర పార్టీలను ఆశ్రయిస్తున్నాయిఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను పరిశీలిస్తే 2019 ఎన్నికల్లో వామపక్షాలు జనసేనతో కలసి నడిచాయి. ఒక్క సీటును కూడా సాధించుకోలేకపోయాయి. రెండు ఎన్నికల్లో అసెంబ్లీలో ప్రాతినిధ్యాన్ని దక్కించుకోలేకపోయాయి. బీజేపీతో ఆ పార్టీ కలసి నడవదు. చంద్రబాబుతో ప్రయాణం కొనసాగించే అవకాశాలు కొట్టిపారేయలేం. కానీ చంద్రబాబు బీజేపీతో సఖ్యత కోసం ప్రయత్నిస్తున్నారు. బీజేపీ కాదన్నా జనసేనతోనయినా ప్రయాణించాలన్న అభిప్రాయంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబును నమ్మి వామపక్షాలు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయలేవు. ఇక అధికారంలో ఉన్న వైసీపీ వెంట కూడా నడిచే అవకాశం లేదు. దీంతో వామపక్ష పార్టీలకు ఒకే దారి ఉంది. అది కాంగ్రెస్ తో కలసి నడవటమే. ఏపీలో కాంగ్రెస్ తో ఏ పార్టీ కూడా పొత్తు పెట్టుకునే అవకాశం లేదు. ఇక వామపక్షాలయితే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీతో ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో ఉన్నాయి. మొత్తం మీద ఏపీలో వామపక్ష పార్టీలకు దారి కన్పించడం లేదు.

# పథకాలు అక్కరకు వస్తాయా...

విజయవాడ, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)ఏపీ సీఎంగా జగన్ అనేక పథకాలు పెడుతున్నారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు కూడా అమలు చేస్తున్నారు. దీనికి మంచి పేరు కూడా వస్తోంది. అయితే.. ఈ పేరు.. ఎన్నికల వరకు నిలబడుతుందా ? అనేది ఇప్పుడు ప్రధానంగా చర్చకు దారితీస్తోంది. దీనికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. వచ్చే ఎన్నికల లోపు.. సీఎం జగన్‌ను ముఖ్యమంత్రి పీఠం నుంచి దింపేసేలా.. ప్రతిపక్ష నేతలు ప్రయత్నిస్తున్నారని అంటున్నారు పరిశీలకులు. ఇదే విషయాన్ని వైసీపీ నేతలు కూడా చెబుతున్నారు. మా నాయకుడు ఉంటేనే పార్టీ నిలబడుతుంది. ఆయన లేకుండా చేయాలనేది ప్రతిపక్షాల వ్యూహంగా ఉంది. దీనిని ఎదుర్కొనడమే ఇప్పుడు గట్టి సవాల్‌గా మారింది" అని వారు గుసగుసలాడుతున్నారు. ఎందుకంటే.. ఇప్పుడు జగన్ చుట్టూ.. ఉన్న కేసులను త్వరలోనే తేల్చేయాలంటూ? ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఒకరిద్దరు కీలక నేతలు.. కోర్టుకు వెళ్లాలని నిర్ణయించారు. ఇటీవల.. విజయవాడలో వీరు భేటీ అయినట్టు ఆలస్యంగా ఒక విషయం వెలుగు చూసింది. వీరిలో టీడీపీకి చెందిన నాయకులు కూడా ఉన్నారు. ముఖ్యంగా జగన్‌పై ఉన్న అక్రమాస్తుల కేసులను తేల్చేసే పనిని ప్రారంభించాలంటూ. సుప్రీం కోర్టులోనే కేసులు వేసేందుకు ప్రయత్నించాలని 'పై నుంచి' ఆదేశాలు అందిన దరిమిలా.. టీడీపీలో న్యాయ సలహాదారుగా కూడా ఉన్న ఓ రాజ్యసభ సభ్యుడి నేతృత్వంలోనే ఈ సమావేశం నిర్వహించారు. దీనికి మరికొందరు.. నేతలు కూడా జతకలిసినట్టు సమాచారం. ఈ పరిణామం.. వైసీపీలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఇదే కనుక జరిగితే.. వచ్చే ఏడాది కాలంలో .. జగన్ సీఎం పదవి నుంచి తప్పుకోవడం తప్పదనే సంకేతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి.. తమ పార్టీని బలోపేతం చేసుకునేదిశగా ఈ నేతలు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు.. ప్రజలు కూడా సంక్షేమ పథకాలు అందని వారు.. జగన్‌పై ఆగ్రహంతోనే ఉన్నారు. పన్నులు పెంచుతుండడం, నీటి మీటర్లు బిగించేందుకు ప్రయత్నాలు చేస్తుండడం వంటివి ప్రజల్లోకి బలంగా వెళ్తున్నాయి. దీంతో మధ్య తరగతి వర్గాల్లో ఇప్పటికే ఉన్న వ్యతిరేకత పెరుగుతుందనే అంచనాలు వస్తున్నాయి. ఈ పరిణామంతో వచ్చే ఎన్నికల లోపే.. జగన్ సర్కారుపై విముఖత పెరిగేలా చేసుకుని.. తమ పట్టు సాధించేందుకు ప్రతిపక్ష పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో జగన్ ఎన్ని చేసినా.. ఎన్నికల నాటికి రివర్స్ అవుతుందనే లెక్కలు వస్తున్నాయి. మరి జగన్ వీటిని ఎలా తట్టుకుని నిలబడతారో ? చూడాలి.

# జగన్ కు వెలిగొండ టెన్షన్

ఒంగోలు, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు ఇప్పుడు అనేక సమస్యలతో పాటు నీటి సమస్య కూడా ప్రధానంగా మారనుంది. ఇప్పటికే తెలంగాణతో తగువు పెట్టుకున్నారు. తొలినాళ్లలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తో సన్నిహిత్యాన్ని జగన్ నెరిపారు. కలసి కూర్చుని సమస్యలను పరిష్కరించుకుందామనుకున్నారు. కానీ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ఇద్దరి మధ్య తేడా కొట్టింది. దీంతో తెలంగాణతో ఇక సుదీర్ఘ కాలం తగవు తప్పేలా లేదు. ఎగువ రాష్ట్రం కావడంతో తెలంగాణకు నీటి వాటా విషయంలో అనేక ప్రయోజనాలున్నాయి. ఇరువురు సహకరించుకుంటేనే నీటి కష్టాలు నెరవేరతాయి. శ్రీశైలం నుంచి విద్యుత్తు ఉత్పత్తి జరుగుతూనే ఉంది. జగన్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసినా ఫలితం ఉండక పోవచ్చు. ఇప్పటికే ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం చేతిలో పెట్టి జగన్ పెద్ద తప్పు చేశారని నీటిపారుదల శాఖ నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ లో వెలిగొండ ప్రాజెక్టు ప్రస్తావన లేదు. దీంతో తిరిగి నోటిఫికేషన్ లో చేర్చాల్సిన బాధ్యత జగన్ పైనే ఉంటుంది. వెలిగొండ ప్రాజెక్టు దాదాపు తుది దశకు చేరుకుంది. వెనకబడిన ప్రకాశం జిల్లా వంటి ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు వరప్రదాయని లాంటిది. అలాంటి వెలిగొండ ప్రాజెక్టు కేంద్రం విడుదల చేసిన గెజిట్ లో లేకపోవడంతో ప్రకాశం జిల్లా ప్రాంత వాసుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇక ఇప్పుడు తెలంగాణతో పాటు కర్ణాటక కూడా జగన్ కు సమస్యగా మారింది. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచుతామని కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దిగువకు వచ్చే నీటి పరిమాణం తగ్గుతుంది. ఫలితంగా కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ కు అన్యాయం జరుగుతుంది. ఈ సమస్య నుంచి బయటపడటం జగన్ కు అంత సులువు కాదు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దారిలోకి రావడం ఈజీకాదు. భవిష్యత్ లో జగన్ కుఇది ప్రధాన సమస్యగా మారనుంది



# పదవులు ఇచ్చినా మార్పు కష్టమేనా

ఏలూరు, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో కొత్త, పాత ఉండదు. నేతల దమ్ము, దన్నును బట్టి పదవులను పొందుతుంటారు. ఏ పార్టీలో ఉన్నా, విపక్షంలో ఉన్నప్పు?డు విమర్శించినా పెద్దగా లెక్కలోకి తీసుకోరు. తమకు రాజకీయంగా ఉపయోగపడతారా? లేదా? అన్నదే చూసుకుంటారు. వైసీపీ అధినేత జగన్ సయితం అనేక మందిని తన పార్టీలో చేర్చుకున్నారు. వారికి పదవులు ఇచ్చారు. అయితే వారు పార్టీకి ఎంతమాత్రం ఉపయోగపడుతున్నారన్నది ప్రశ్నార్థకమే.వైసీపీ ఆవిర్భావం నుంచి అనేక మంది నేతలు జగన్ వెంట నడిచారు. జగన్ పార్టీ గెలుస్తుందో లేదో తెలియదు. ఆయన కేసుల్లో కూరుకుపోయి ఉన్నారు. ఎప్పుడు జైలుకు వెళతారో తెలియదు. అయినా నేతలు జగన్ ను నమ్ముకుని ఉన్నారు. అధికారంలో వైసీపీ లేకపోయినప్పటికీ తమ జేబులో నుంచి నిధులు ఖర్చు చేసి జగన్ పట్ల తమ ప్రేమను, గౌరవాన్ని చాటుకున్నారు. ఇలాంటి నేతలు నియోజకవర్గానికి పదుల సంఖ్యలో ఉంటారన్నది వాస్తవం.కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తన వెంట నమ్మకంగా ఉన్న నేతలను పక్కన పెట్టినట్లే కన్పిస్తుంది. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు ఇచ్చారు. రాజకీయంగా వారికి అవకాశం కల్పించారు. జూపూడి ప్రభాకర్ రావు వైసీపీ ఓటమి పాలు కాగానే టీడీపీలోకి వెళ్లి అక్కడ పదవులు అనుభవించి, తిరిగి అధికారంలోకి రాగానే జగన్ ఆయనకు నామినేట్ పోస్టు ఇచ్చారు. సామాజిక న్యాయసలహాదారును చేశారు.తోట త్రిమూర్తులు టీడీపీ నుంచి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీని జగన్ చేశారు. కాపు సామాజికవర్గం కాబట్టి, భవిష్యత్ లో రాజకీయంగా ఉపయోగపడతారని జగన్ ఆయనను ఎమ్మెల్సీ చేశారు. అదే సమయంలో తన వెంట నడిచిన కాపు నేతలను మాత్రం జగన్ విస్మరించారు. ఇలా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి జగన్ పదవులు ఇవ్వడం, తమను పట్టించుకోక పోవడం, భవిష్యత్ లో పదవులు వస్తాయన్న నమ్మకం లేకపోవడంతో పూర్తి నిరాశా నిస్పృహలో ఉన్నారు. వీరంతా వచ్చే ఎన్నికల నాటికి పార్టీని వీడతారన్న టాక్ కూడా వినిపిస్తుంది. రాయలసీమకు చెందిన ఒక ముఖ్యనేత పార్టీని వీడేందుకు సిద్ధమవ్వడంతో మరోసారి ఇది చర్చనీయాంశంగా మారింది.

# నాదెండ్ల మనోహర్ మారుతున్నారు



గుంటూరు, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో రాణించాలంటే ఎక్కువ గ్యాప్ ఉండకూడదు. ఒకసారి ఓడినా మరోసారి గెలిస్తేనే నియోజకవర్గంలో పట్టు సడలి పోకుండా ఉంటుంది. కానీ పదేళ్లు గ్యాప్ వస్తే.. ప్రత్యర్థులు గట్టి వారయితే.. మరోసారి చేతులు కాల్చుకునే కంటే నియోజకవర్గాన్నే మార్చేయడం బెటర్. ఇప్పుడు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఇప్పుడు అదే పనిలో ఉన్నారు. తనను ఆదరించిన ప్రజలకు దూరమవ్వాలన్న నిర్ణయం తీసుకున్నారు.తెనాలి నియోజకవర్గంలో ఈసారి పోటీ చేయాలా? మరో నియోజకవర్గాన్ని ఎంచుకోవాలన్న దానిపై జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్ ఆలోచనలో పడ్డారు. తెనాలి నియోజకవర్గం నుంచి నాదెండ్ల మనోహర్ రెండుసార్లు విజయం సాధించారు. 2004లో గోగినేని ఉమ, 2009 ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లపై ఆయన విజయం సాధించారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత నాదెండ్ల మనోహర్ వైసీపీలో చేరతారనుకున్నా జనసేనలో చేరారు.మొన్నటి ఎన్నికలలోనూ నాదెండ్ల మనోహర్ దారుణ ఓటమిని చవి చూశారు. జగన్ వేవ్ అనుకున్నప్పటికీ మరోసారి తెనాలి నియోజకవర్గం నుంచి గెలిచే అవకాశాలు తక్కువనే చెప్పాలి. ఎందుకంటే వైసీపీ స్ట్రాంగ్ అయింది. ప్రస్తుత ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. మరోవైపు ఇక్కడ టీడీపీ కూడా బలంగా ఉంది. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ టీడీపీని తెనాలిలో బలోపేతం చేస్తున్నారు. క్యాడర్ కు అందుబాటులో ఉంటున్నారు.ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో నాదెండ్ల మనోహర్ తెనాలి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే ఓటమి తప్పదన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. నాదెండ్ల మనోహర్ కూడా అదే అభిప్రాయంలో ఉన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే తాను తెనాలిలో పోటీ చేస్తానంటున్నారు. ఆయన కనుక బరిలో ఉంటే తాను మరొక నియోజకవర్గానికి ఛేంజ్ అవ్వాలని నిర్ణయించుకున్నారు. గుంటూరు జిల్లాలోనే జనసేన బలంగా ఉన్న నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని నాదెండ్ల మనోహర్ భావిస్తున్నారు.

# 25 మందికి టిక్కెట్లకు నో ఛాన్స్

నెల్లూరు, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ ఈసారి అధికారంలోకి రావాలి. రాకుంటే ఇక దుకాణం మూసివేసుకోవాల్సిందే. ఈ విషయం పసుపు పార్టీలోని ప్రతి ఒక్కరికి తెలుసు. అందుకే చంద్రబాబుకు వచ్చే ఎన్నికలు సవాల్ గా మారనున్నాయి. చంద్రబాబుకు కూడా వయసు మీద పడటంతో ఆయన హుషారుగా పాల్గొనే చివరి ఎన్నికలు ఇవేనన్నది పార్టీ వర్గాలు సయితం అంగీకరిస్తున్న విషయం. ఈ నేపథ్యంలో చంద్రబాబు పార్టీ గెలుపు కోసం అన్ని చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటున్నారు.వచ్చే ఎన్నికలకు పార్టీ అభ్యర్థుల కోసం ఇప్పటి నుంచే వడపోత మొదలుపెట్టారు. ఏపీలో ఉన్న 175 నియోజకవర్గాలకు ఇప్పుడు ఇన్ ఛార్జిలు ఉన్నారు. కేవలం కొన్నింటికి మాత్రమే చంద్రబాబు ఇన్ ఛార్జిలను నియమించలేదు. ఇక చంద్రబాబు వరసగా సీనియర్లతో సమావేశమవుతున్నారు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారనుంది. ఇప్పటికే వరసగా రెండు సార్లు ఓటమి పాలయిన వారికి తిరిగి టిక్కెట్ ఇవ్వాలా? వద్దా? అన్న దానిపై చర్చిస్తున్నారు.వరసగా రెండు సార్లు ఓటమి పాలయిన నియోజకవర్గాల్లో పాత నేతలకు టిక్కెట్ ఇవ్వాలా? లేక కొత్త నేతలకు అవకాశం కల్పించాలన్న దానిపై చంద్రబాబు కసరత్తు ప్రారంభించారని తెలుస్తోంది. వరసగా రెండుసార్లు ఓటమి పాలయిన వారిపై సానుభూతి ఉంటుంది. వీరిలో పార్టీలో యాక్టివ్ గా ఉన్న నేతలకు తిరిగి టిక్కెట్ ఇవ్వాలని, దీనిపై సర్వే చేయించి ఫైనల్ నిర్ణయం తీసుకోవాలన్నది చంద్రబాబు అభిప్రాయంగా ఉంది.ఏపీలో 2014, 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసి ఓటమిపాలయిన వారు దాదాపు పాతిక నియోజకవర్గాలు ఉన్నట్లు గుర్తించారు. వీరి స్థానంలో ఆ నియోజవర్గంలో యాక్టివ్ గా ఉన్న పార్టీ నేతల పేర్లను కూడా చంద్రబాబు తెప్పించుకున్నారు. రెండు సార్లు వరస ఓటములను పొందిన వారికి ఈసారి టీడీపీలో టిక్కెట్లు దక్కడం కష్టమేనన్నది పార్టీ వర్గాల నుంచి తెలుస్తోంది. మొత్తం మీద టీడీపీ అధినేత చంద్రబాబు టిక్కెట్ల కేటాయింపుపై కసరత్తు ఇప్పటి నుంచే ప్రారంభించారు.

# చిల్లకూరు ఎంపీపీ అధ్యక్ష పీఠం వేమారెడ్డి కైవసం



నెల్లూరు సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా, చిల్లకూరు మండల పరిషత్ అధ్యక్ష పీఠం వేమారెడ్డి కుమార్ స్వామి రెడ్డి కైవసం చేసుకుని చిల్లకూరు మండల కంచుకోటను వేమారెడ్డి కుటుంబం కాపాడుకొంది. ఒక్కనొకప్పుడు జిల్లాలో పెద్ద కుటుంబం గా గుర్తింపు తెచుకున్న వేమారెడ్డి కుటుంబం, ఆనాటి పూర్వపు వైభవాన్ని తీసుకొని వచ్చే పనిలో వేమారెడ్డి కుటుంబ వారసుడు వేమారెడ్డి కుమార్ రెడ్డి ఆ దిశగా అడుగులు వేస్తూ, చిల్లకూరు మండల పరిషత్ అధ్యక్షపీఠం,జడ్పీటీసీ కైవసం చేసుకొని సత్తా చాటారు.శుక్రవారం చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు ఎంపిపి,ఉప ఎంపిపి ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు

## సంబరాలు చేసుకున్న వైకాపా నేతలు

మండలంలో వైసీపీ తరుపున గెలుపొందిన 13 మంది ఎంపిటిసి సభ్యులు, వేమారెడ్డి కుమార్ స్వామి ఆధ్వర్యంలో హాజరయ్యారు.అంతకు ముందే వైసీపీ అధిష్టానం పంపిన సీల్డ్ కవర్లు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు చేతులు మీదుగా వేమారెడ్డి అందుకున్నారు.రిటర్నింగ్ అధికారులు 13 మంది ఎంపిటిసి సబ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించి,సీల్డ్ కవర్ ఓపెన్ చేసి ఎంపిపి,ఉప ఎంపిపి, కో అప్షన్ పేర్లు వెల్లడించారు.విప్ ప్రకారం 13 మంది ఎంపిటిసి సభ్యులు ఏకగ్రీవంగాచిల్లకూరు ఎంపిపిగా తుపాకుల వెంకట రమణమ్మ, ఉప ఎంపిపిగా వేమారెడ్డి కుమార్ స్వామి రెడ్డిలను ఎన్నుకున్నారు.అనంతరం ఎంపిపి,ఉప ఎంపిపి ల చేత రిటర్నింగ్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించి అధికారికంగా పత్రాలు అందజేశారు.చిల్లకూరు ఎంపిపిగా తుపాకుల వెంకట రమణమ్మ, ఉప ఎంపిపిగా వేమారెడ్డి కుమార్ స్వామి రెడ్డి లు అవ్వడంతో చిల్లకూరు మండలంలో వేమారెడ్డి అభిమానులు, వైసీపీ నేతలు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. వేమారెడ్డి కుటుంబ వారసుడు కుమార్ స్వామి రెడ్డి అనతి కాలంనే రాజకీయాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. అందువలనే పరిషత్ ఎన్నికల్లో 13 ఎంపీటీసీ లు,జడ్పీటీసీ ని కైవసం చేసుకొని వేమారెడ్డి కుటుంబ సత్తా ఏమిటో మరోసారి చాటారు.ఈ కార్యక్రమంలో తిప్పగుంట సర్పంచ్ యల్లాంటి సుకన్య, వైసీపీ నేతలు కొండపల్లి శ్రీనివాసులు రెడ్డి, యల్లాంటి సనత్ కుమార్ రెడ్డి, వేమారెడ్డి అభిమానులు, వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# మనుబోలు మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలుగా గుండాల వజ్రమ్మ ఎంపిక

## మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడిగా తిక్కవరపు వెంకట రమణారెడ్డి

నెల్లూరు సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా,మనుబోలు మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలుగా బండే పల్లి గ్రామానికి చెందిన గుండాల వజ్రమ్మను, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులుగా పిడూరు గ్రామానికి చెందిన తిక్కవరపు వెంకట రమణారెడ్డిని లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. తొలుత సర్వేపల్లి శాసనసభ్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి బుధవారం ఆధ్వర్యంలో ఇక వైకాపా నాయకుల సమక్షంలో కోదండరాం పురంలో డి. ఎస్ .ఆర్ కళ్యాణమండపంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో 11 ఎంపీటీసీ సభ్యులు వైకాపా నేతల సమక్షంలో ఎంపీపీని ఎమ్మెల్యే ఖరారు చేసి ప్రకటించారు. ఈ విషయమై సంబంధించిన ఎంపీటీసీలు , స్థానిక వైకాపా నాయకులు ఎంపీపీ, ఉప ఎంపీపీ ప్రమాణ స్వీకార ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంఘీభావం



తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపిక కాబడిన మన మనుబోలు మండల పరిషత్ అధ్యక్షురాలు గుండాల వజ్రమ్మ , ఉపాధ్యక్షులు తిక్కవరపు రమణారెడ్డి లు మాట్లాడుతూ తమపై నమ్మకం అప్పగించిన పదవి బాధ్యతలు నిర్వహిస్తూ , మనుబోలు మండల అభివృద్ధికి , ప్రజాసంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని సంయుక్తంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు , మండల వైకాపా నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 38 నిమిషాలలో 2 లక్షల టిక్కెట్లు



తిరుమల, సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)శ్రీవారి సర్వ దర్శనం టోకెన్లు ఆన్ లైన్ లో విడుదలయ్యాయి. అయితే, రిలీజ్ చేసిన టిక్కెట్లు కేవలం 35 నిమిషాల్లో ఖాళీ అయిపోయాయి. ఈ ఉదయం 9 గంటలకు శ్రీవారి సర్వదర్శనం టోకెన్లు ఆన్ లైన్ లో విడుదల చేసింది టీటీడీ. అయితే, ఆశ్చర్యకరంగా విడుదల చేసిన 35 నిమిషాల్లో ఏకంగా 2.88 లక్షల టికెట్లు బుక్ చేసుకున్నారు భక్తులు.టికెట్ల బుకింగ్ కు ఉన్న విపరీతమైన డిమాండ్ ను ఎదుర్కోవడానికి వర్చువల్ క్యూ పద్ధతిలో టికెట్ల కేటాయింపు చేశారు. వర్చువల్ క్యూ ద్వారా ముందుగా వెబ్ సైట్ లో లాగిన్ అయిన వారికి అవకాశం కల్పించారు. వర్చువల్ క్యూ పద్ధతి పాటించడంతో సర్వర్ల క్రాష్ సమస్య ఈ సారి తప్పింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా టికెట్లు బుక్ చేసుకున్నారు భక్తులు.ఇదిలాఉంటే, తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు సంఖ్య పెరుగుతుండటంతో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. దర్శనానికి వచ్చే భక్తులకు పలు నిబంధనలు విధించింది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులు రెండు డోసుల వ్యాక్సిన్ వేయించుకున్న సర్టిపికెట్ తప్పనిసరిగా చూపాలని ఆలయ ఈవో జవహార్ రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే.. మూడు రోజుల ముందు కరోనా పరీక్ష చేయించుకున్న నెగిటివ్ సర్టిఫికెట్ అయినా తీసుకురావాలన్నారు.టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యకార్యదర్శిగా ఈవో జవహార్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ విధానం అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందన్నారు. అయితే, 12 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు ఈ నిబంధన నుంచి సడలింపు ఇస్తున్నట్లు తెలిపిన ఆయన.. ఆధార్ కార్డు తప్పనిసరి అని తెలిపారు. ఇక 12 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయస్సు గలవారికి దర్శనం తేదీ నుంచి 72 గంటల ముందు కరోనా నెగిటివ్ సర్టిఫికెట్ తప్పనిసరి.

# అన్నమయ్య కీర్తనలు అందరికీ చేరువకావాలి- అదివో అల్లదివో ....

## అన్నమయ్య పాటల పోటీలకు ఎంపిక ప్రారంభం- ఎస్వీబిసి ఛైర్మన్ డా. సాయి కృష్ణ యాచేంద్ర

తిరుపతి,మా ప్రతినిధి,సెప్టెంబర్ 25, తిరుమల శ్రీవారి తత్వాన్ని లోకానికి చాటిన అన్నమయ్య కీర్తనలు అందరికీ చేరువ కావాలని ఎస్వీబిసి ఛైర్మన్ డా.శ్రీ సాయి కృష్ణ యాచేంద్ర అన్నారు. ఎస్వీబిసి కార్యాలయం స్టూడియోలో శనివారం "అదివో అల్లదివో ....అన్నమయ్య పాటల పోటీలకు గాయకుల ఎంపిక కార్యక్రమం ప్రారంభమమైంది. ఈ సందర్భంగా ఎస్వీబిసి ఛైర్మన్ మాట్లాడుతూ, అన్నమయ్య 32 వేల కీర్తనలను రచించగా, 14 వేల కీర్తనలు లభించాయని, వీటిలో ఇప్పటివరకు 4000 కీర్తనలను టిటిడి ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు రికార్డింగ్ చేసినట్లు తెలిపారు. అన్నమయ్య రాసిన కీర్తనలకు శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా ప్రాధాన్యం, విస్తృత ప్రచారం కల్పించాలని టిటిడి ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో నిర్ణయించినట్లు చెప్పారు. అదివో అల్లదివో ....కార్యక్రమం ద్వారా ఔత్సాహికులైన యువతి యువకులకు అన్నమయ్య పాటల పోటీలకు కళాకారుల ఎంపిక పరీక్షలు నిర్వహించి ఇందులో ఎంపికైన వారితో అన్నమయ్య సంకీర్తనలు పాడిస్తామన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలతో పాటు చెన్నై, బెంగుళూరు నగరాల్లోని యువతకు అన్నమయ్య కీర్తనలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. తొలుత జిల్లాస్థాయిలో, ఆ తరువాత రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఇందులో భాగంగా శని, ఆది వారాల్లో చిత్తూరు జిల్లాకు చెందిన 15 నుంచి 25 సంవత్సరాల వయస్సులోపు ఉన్న గాయనీ, గాయకులకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువ గాయని గాయకులు కొత్త పాటలు ఆలపించాలన్నారు.

# ఎగుమతుల అవకాశాల సద్వినియోగానికే వాణిజ్య ఉత్సవం

తిరుపతి, మా ప్రతినిధి,సెప్టెంబర్ 25కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయముతో వాణిజ్య ఉత్పత్తులు ఎగుమతి కోసం జిల్లాలోని పారిశ్రామిక ఔత్సాహికులు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఇ. ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం రేణిగుంట ఎలక్ట్రానిక్ మానుఫాక్చర్ క్లస్టర్ ? 2 వద్ద ఎ. పి. ఐ. ఐ. సి. ఓ. డబ్ల్యు. ఎస్. బిల్డింగ్ లో "వాణిజ్య ఉత్సవం "కార్యక్రమం జిల్లా పరిశ్రమల శాఖ, ఎ పి ఐ ఐ సి సమన్వయము తో ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. జి. ఎం., డి.ఐ.సి. మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవం జరుపుకుంటున్న సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయముతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పారిశ్రామిక వేత్తలు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవడానికి అవగాహన కల్పించాలని ఈ సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. స్టాంప్ డ్యూటీ రీయంబర్స్ మెంట్, సబ్సిడీ, యూనిట్ల ఏర్పాటుకు గల అవకాలు, విద్యుత్ సబ్సిడీ, వంటివి పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని, జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో వున్న ఎగుమతులు, వాటి అవకాశాలు వంటివి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సదస్సులో ఎ పి ఐ ఐ సి పారిశ్రామిక వేత్తలకు కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు కావలసిన భూమి వివరాలు తమ వెబ్ సైట్ లో పొందుపరచామని సద్వినియోగం చేసుకోవాలని ఎస్. సువన సోని వివరించారు. కస్టమ్స్ మరియు సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లతీఫ్ ఎగుమతుల పాలసీ విధానం, జి ఎస్ టి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ చెన్నా రెడ్డి ఎగుమతులపై టాక్స్ విదానం వంటివి వివరించగా, యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ పి డి వి శర్మ , లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరి రావు , వ్యాపార వేత్తలు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకర్ల సహకారం పొందాలని సూచించారు. వాణిజ్య ఉత్సవంలో జిల్లాకు చెందిన వి. ఆ.ర్ వి. ఏషియా పసిఫిక్, కాంటినెంటల్ కాఫీ, జెన్ లినెన్ , వేర్ మెరియన్ ఇండియా, రేహాబ్ , పుట్టా శ్రీ లెదర్స్, గియాన్ ఫార్మా, రాక్ వర్త్ ఫర్నిచర్, సువేరా ఫుడ్స్, ఆర్. ఎస్. ఫోటో. కోటింగ్, ఆర్. వి. ఆర్. గ్రానైట్స్ , రాజారాం ఇండస్ట్రీస్, ఎ. కె. ఆర్. టెక్స్ టైల్స్, టెర్రకోట బొమ్మలు, కలంకారీ వస్తువులు, బాలాజీ వుడ్ కార్వింగ్ కోయ బొమ్మలు, ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ వాణిజ్య ఉత్సవం లో జిల్లాకు చెందిన పలు పారిశ్రామిక వేత్తలు, కళాశాలల విద్యార్థులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాలిక మృతి?బంధువుల అందోళన

కడప సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)కడప నగరంలోని అమ్మ ప్రయివేటు అసుపత్రిలో ఇంజక్షన్ వికటించి బాలిక మృతి చెందిందని అసుపత్రి ఎదుట బంధువులు అందోళనకు దిగారు. డాక్టర్ ఇచ్చిన ఇంజక్షన్ వికటించడం వల్లే చనిపొయిందంటూ కుటుంబీకుల అగ్రహం వ్యక్తం చేసారు. కుటుంబీకులు,బందువుల అందోళనతొ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అసుపత్రి వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. గడచిన మూడు రోజులుగా జ్వరం రావడంతో ఇదే అసుపత్రిలో చికిత్స అందించారు.రాత్రి ఇంజక్షన్ వేసిన చొట వాపు రావడంతో మరొమారు బాధితులు అసుపత్రికి వచ్చారు. అసుపత్రికి రావడంతొ సరిగ్గా వైద్యం అందించకుండా వైద్యుడు నిర్లక్ష్యంగా వ్యవహరించాడంటూ అరోపించారు. ఈ ఘటన అలస్యంగా వెలుగులొకి వచ్చింది. అసుపత్రిపై చర్యలు తీసుకొవాలని వారు డిమాండ్ చేసారు.

# రౌడీ షీటర్ దారుణ హత్య

రాజమహేంద్రవరం సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంనగరంలో బ్లడ్ బ్యాచి లకు రౌడీ షీటర్ మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత స్థానిక పనస చెట్టు ఏరియా వద్ద ఒక రౌడీ షీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సి టి ఆర్ ఐ. పరిధిలో నివాసం ఉంటున్న దొంగ రెడ్డి( 28 ) అనే రౌడీ షీటర్ కు అతని ప్రత్యర్థులు. బ్లేడ్ బ్యాచ్ షూటర్ సాయి, రౌడీషీటర్ లక్ష్మణ్ మరో ఇద్దరు తో పాత కక్షలు ఉన్నాయని తెలుస్తుంది ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి అదేవిధంగా శుక్రవారం రాత్రి కూడా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగాయని తరువాత ఎవరి ఇళ్లకు వాళ్ళు వెళ్ళిపోతారు నట్లు స్థానికులు సమాచారం మద్యం మత్తులో ఉన్న షూటర్ సాయి అర్ధరాత్రి ఒంటిగంట దాటిన తర్వాత మేడ పై పడుకున్నా దొంగ రెడ్డి ని నిద్రలేపి వెంట తెచ్చుకున్న మారణాయుదంతో విచక్షణా రహితంగా నరికి వేయడంతో అక్కడ అక్కడ రౌడీ షీటర్ దొంగ రెడ్డి అక్కడికక్కడే కుప్పకూలాడు జరిగిన సంఘటన పై సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు దీనిపై మూడో పట్టణ సీఐ మధు బాబు మాట్లాడుతూ నిందితుల కోసం గాలిస్తున్నామని ఇరువర్గాల మధ్య పాత కక్షలు ఉన్న నేపథ్యంలో ఈ దారుణ హత్య జరిగిందన్నారు.నేరాలు-ఘోరాలు ఎన్నో జరుగుతున్నఅప్పటికి అదుపులోకి తీసుకు రాలేక పోతున్నారని అప్పుడు ఇప్పుడు జరుగుతూనే ఉన్నాయిని నగర ప్రజలు వాపోతున్నారు

# బారుజోల తారు రోడ్డు పనులు పూర్తి చేయాలి

విశాఖపట్నం సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్) అరకునియోజకవర్గం, అనంతగిరి మండలం మారుమూల గ్రామాలైన , బారజోల తారురోడ్డు పనులు పూర్తి చేయాలని, జనసేన నాయకుడు సాయిబాబా అధ్వర్యంలో శనివారం నాడు, ఆయా గ్రామంలో పర్యటించి, ముందుగా గిరిజనులతో సమావేశమై చర్చించారు, ముఖ్యంగా ఆయాగ్రామంలో రోడ్డు సదుపాయాలు అందుబాటులో లేకా అభివృద్ధికి ఆమడ దూరంలో అక్కడ గిరిజనులు వున్నారని తెలిపారు, తారు రోడ్డు మంజూరు చేసి నేటికి మూడు సంవత్సరాలు గడిచిన గుత్తేదారు రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలో నిలిపి వేశారు, రోడ్డు పనులోకూడ నాణ్యత లేదు, ఇదివరకు పనులు చేపట్టిన కల్వర్టు లో కూడ నాణ్యతలేని, పనులు చేసే వున్నారని తెలిపారు,ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ , ప్రభుత్వ సంబంధిత అధికారులు తక్షణం ఏభారజోల రోడ్డు పైదృష్టి పెట్టాలని, నాణ్యతలేని రోడ్డు, కల్వర్టు పనులు చేయించినగుత్తేదారుడు పై చర్యతీసుకోవాలని, ప్రభుత్వానికి డిమాండు చేశారు, అనంతరం దీనికై నిరసనగా గిరిజనుల తో పాటు కిలోమీటర్ల దూరంవరకు, ప్రభుత్వానికి నిరసనరూపంలో జనసేన నాయకుడు సాయిబాబా అధ్వర్యంలో చేసారు,ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు, జనసైనికులు దాసు, శ్రీను తదితరులు పాల్గొన్నారు

# గూడూరు ఎంపీపీ మరియు ఉప ఎంపీపీ లకు ఎమ్మెల్సీ బల్లి అభినందనలు.

నెల్లూరు సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా, గూడూరు మండల పరిషత్ అధ్యక్ష పీఠం వైకాపా కైవసం చేసుకుంది. శుక్రవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, ఉప ఎంపిపి ప్రమాణ స్వీకారం కార్యక్రమం రిటర్నింగ్ అధికారులు నిర్వహించారు.మొత్తం 8 మంది ఎంపీటీసీ లల్లో 6 మంది ఎంపిటిసిలు హాజరు అయ్యారు. ఓటింగ్ లో 6 మంది ఎంపీటీసీ సభ్యులు వేడిచర్ల ఎంపిటిసి సెగ్మెంట్ సభ్యులు బూదూరు గురవయ్య ఎంపిపి అభ్యర్థి కావడంతో ఆయనకు అందరూ ఓటు వేసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అదే విధంగా ఉపాధ్యక్షుడుగా వైస్ ఎంపీపీగా మెడనోలు శ్రీనివాసులు రెడ్డి,కో ఆప్షన్ సభ్యుడిగా మన్సూర్ అహ్మద్ లను ఎంపీటీసీ లు ఓట్లు వేసి ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.ఎంపిపి, ఉప ఎంపిపి ప్రమాణస్వీకార కార్యక్రమంలోఎటువంటివివాదాలు,గొడవలులేకుండా విప్ ప్రకారం కార్యక్రమంజరిగింది.శుక్రవారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు గూడూరులో ఎమ్మెల్యే స్వగృహంలో ఎంపీపీ,ఉప ఎంపిపి అభ్యర్థులకు బీఫామ్ అందజేశారు., మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వైస్ ఎంపీపీగా ఎన్నికైన వారిచేత ఎన్నికల రిటర్నింగ్ అధికారిప్రమాణస్వీకారంచేయించారు.గూడూరు మండలంలో 8 ఎంపిటిసిసభ్యులలో , ఎంపీపీ ఎన్నికకు ఇద్దరు హాజరు కాలేదు .టీడీపీతో పాటు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది వైసీపీలో చేరిన కొమ్మ నేటూరు ఎంపిటిసి అభ్యర్థి కూడా హాజరు కాకపోవడం అందరిని ఆచ్యర్యానికి గురిచేసింది

# నకిలీ కరెన్సీ ముఠా ఆరెస్టు

గుత్తి సెప్టెంబర్ 25, (న్యూస్ పల్స్)గుత్తి పట్టణ శివారులో అక్రమంగా గా ఫేక్ కరెన్సీ తయారీకి ఉపయోగించే నల్లటి నోట్ లను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుండి ఫేక్ కరెన్సీని తయారు చేసేందుకు ఉపయోగించే నోట్లు, ద్రావకాలను, మరియు 3 సెల్ ఫోన్లను గుత్తి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లా గుత్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేట గ్రామ శివారులోని జాతీయ రహదారిపై కర్నూలు జిల్లా కు చెందిన సలీం మరియు మల్లికార్జున అనే ఇద్దరు వ్యక్తులు కలిసి అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం లక్షుం పల్లి గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి కి ఒక లక్ష ఒరిజినల్ కరెన్సీ నోట్స్ ఇచ్చినట్లయితే లక్షల దొంగ నోట్లు ను ఇస్తామని బేరం కుదుర్చుకుని గుత్తి పట్టణ శివారులోని జాతీయ రహదారి పై ఫేక్ కరెన్సీ నోట్లను సుధాకర్ అనే వ్యక్తికి చూపించి కావాలంటే మా దగ్గర ఉన్న కెమికల్స్ తో ఓ నోట్ నీ కడిగి చూపిస్తాము అని చెప్పారు.అయితే వాస్తవానికి వారు దొంగ నోట్లు తీసుకురాకుండా నల్లటి పేపర్లను కట్ చేసుకుని ఈ నల్లటి నోట్లతో ఫేక్ కరెన్సీ తయారు చేయవచ్చని వారినీ నమ్మించి వారిని మోసం చేసి సుధాకర్ అనే వ్యక్తి వద్ద నుండి నిజమైన లక్ష రూపాయల డబ్బులను తీసుకుని ఉడాయించా లనీ ప్రయత్నం చేశారు.

## తుగ్గలి మండల జడ్పీటిసి గా ప్రమాణస్వీకారం చేసిన పులికొండ నాయక్

### ఎమ్మెల్యే కు,మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసిన జెడ్పీటిసి

తుగ్గలి సెప్టెంబర్ 25, ( విభారె) జడ్పీటిసి మరియు ఎంపిటిసి ఫలితాలలో తుగ్గలి మండలం వ్యాప్తంగా 17 ఎంపిటిసి స్థానాలలో మరియు 1 జెడ్పీటిసి స్థానాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించిన వైఎస్ఆర్ సీపీ నాయకులకు,కార్యకర్తలకు మరియు ప్రజలకు తుగ్గలి మండల జడ్పీటిసి పులికొండ నాయక్ కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం రోజున తుగ్గలి మండల జడ్పీటిసి గా పులికొండ నాయక్





ప్రమాణస్వీకారం చేశారు. జెడ్పీటీసీ గా ప్రమాణ స్వీకారానికి ముందుగా ఎమ్మెల్యే శ్రీదేవి కు మరియు మండల వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ పులికొండ నాయక్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తుగ్గలి మండల జడ్పీటిసి అభ్యర్థిగా తనను 9721 ఓట్ల మెజారిటీతో గెలిపించిన ందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియ జేశారు.పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సహాయ సహకారాలతో మండల అభివృద్ధి కొరకు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.అదేవిధంగా తనపై నమ్మకం ఉంచి జడ్పీటిసి అభ్యర్థిగా బరిలో నిలిపి గెలిపించినందుకు తుగ్గలి మండల వైఎస్ఆర్సిపి నాయకులకు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు ఈ స్థానిక ఎన్నికల విజయానికి కారణమని తెలి యజేశారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కొరకు మరియు మండల అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జిట్టా నాగేష్,ఎర్రగుడి రామచంద్రా రెడ్డి,గోపాల్ రెడ్డి, బసి రెడ్డి,తుగ్గలి మోహన్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి, నాగభూషణ్ రెడ్డి,పాటిల్ సుధాకర్ రెడ్డి,ఎర్ర నాగప్ప,గుంతా రఘు,తెరప్ప తదితర వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు జరిగే భారత్ బంద్ ను జయప్రదం చెయ్యండి షర్ఫుద్దీన్ అలీ

పాములపాడు ( సెప్టెంబర్ 25, ( విభారె) ఈ నెల 27 వ తేదీ సోమవారం జరిగే




భారత్ బంద్ లో అన్ని ప్రజా సంఘాల ,అన్ని రాజకీయ పార్టీల నాయకులు రైతులు, పాల్గొని విజయవంతం చేయాలని సేవా భారతి అధ్యక్షులు షర్ఫుద్దీన్ అలీ కోరారు రైతు వ్యతిరేక విధానాల వల్ల దేశానికి చాలా నష్టం కలుగుతుందని యువత మేధావులు అన్నిరకాల వ్యాపార యజమానులు, డ్రైవర్లు ,, కూలీలు, పెద్దయెత్తున పాల్గొని విజయవంతం చేయాలని సేవా భారతి యూత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు యస్. షర్ఫ ద్దిన్ అలి కోరారు.

## నారాయణ కార్పొరేట్ కళాశాలలో అధిక ఫీజుల దంధను అరికట్టాలి

### కళాశాలలో ధర్నా నిర్వహించిన పి.డి.ఎస్.యునాయకులు




ఎమ్మిగనూరు సెప్టెంబర్ 25, ( విభారె) పట్టణంలో ఉన్నటువంటి నారాయణ కార్పొరేట్ కళాశాలలో అధిక ఫీజుల దంధను అరికట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి.డి.ఎస్.యు) జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నారాయణ కళాశాల ముందు ధర్నా నిర్వహించి ఫీజుల దందకు వ్యతిరేకంగా కుర్చిలను ద్వాంసం చేయడం జరిగింది. ఈ సందర్బంగా మహేంద్ర బాబు మాట్లాడుతూ నారాయణ కళాశాల యాజమాన్యం ప్రభుత్వం నిబంధనలు పాటించకుండా ధనమే ధ్యేయం గా విద్యార్థులతో వేలకు వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారు అని అన్నారు.అదేవిదంగా అంగడి దుకాణం లా పాఠ్య పుస్తకాల అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీడిస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి కళాశాల పై విచారణ చేపట్టి గుర్తింపు రద్దు చేయాలి లేనిపక్షం లో కళాశాలపై దశల వారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు తాలూకా అధ్యక్షులు రామకృష్ణ నాయుడు, పట్టణ అధ్యక్షులు సమీర్ నాయకులు నరసింహ రెడ్డి,రమణ,వీరేష్,వంశి, భాస్కర్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు

## 27 వ తేదీన జరిగే భారత్ బంద్ కు సంపూర్ణ మద్దతు

### బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం అధ్యక్షులు వంకిరి రామచంద్రుడు



నంద్యాల సెప్టెంబర్ 25, ( విభారె) – నంద్యాల పట్టణంలో శనివారం నాడు ఓ ప్రకటనలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు వంకిరి.రామచంద్రుడు,జిల్లా సహాయ కార్యదర్శి షేక్.రియాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నెలల నల్ల చట్టాలను రద్దు చేయాలని, పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఈనెల 27 వ తేదీన జరిగే భారత్ బంద్ కు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం పూర్తిస్థాయిలో సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆయన అన్నారు , కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవని,కోవిడ్ నేపథ్యంలో ఉద్యోగాలు పోయి అనేకమంది నిరుద్యోగ తయారయ్యారని, బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ, దేశంలో నూతన విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను నాశనం చేయడానికి తయారయిందని, సామాన్య ప్రజలు పెట్రోల్ డీజిల్ గ్యాస్ లాంటి నిత్యావసర వస్తువులు మరియు సరుకుల ధరలు అమాంతం పెంచి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నారని, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకు వచ్చి వ్యవసాయని కూడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు సిద్ధమైందని వారన్నారు, 27వ తేదీ జరిగే భారత్ బంద్ కు విద్యార్థి యువజనలు, నిరుద్యోగులు, రైతులు, ప్రజలు భారీ ఎత్తున హాజరై బందును జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ ఏ.బీ. బర్ధన్.గారి 96వ జయంతి సందర్భంగా నంద్యాల లో ఘన నివాళి

### సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాబా ఫక్రుద్దీన్. పట్టణ కార్యదర్శి కె ప్రసాద్

నంద్యాల సెప్టెంబర్ 25, ( విభారె) :- సీపీఐ జాతీయ సమితి పూర్వ ప్రధానకార్యదర్శి. ఎఐటియుసి పూర్వ ప్రధాన కార్యదర్శి అమరజీవి కామ్రేడ్.ఎబి.బర్ధన్ గారి 96వ జయంతి సందర్భంగా శనివారం నాడు నంద్యాల పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాబా ఫక్రుద్దీన్. సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్. షరీఫ్ భాష. ఏ ఐ టి యు సి పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం. కార్యదర్శి జి సోమన్న. ఐ. ఏ.ఎల్. నాయకులు సిపిఐ నాయకులు కలాం భాష. ఖలీల్. పుల్లయ్య. దానం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడుఎస్.బాబా ఫక్రుద్దీన్. సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ. స్వాతంత్ర సమరయోధులు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి. కామ్రేడ్ ఏబీ బర్ధన్ గారు భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం ఎనలేని కృషి చేసిన మహోన్నత నాయకుడు అని కొనియాడారు. భారతదేశంలో కార్మిక హక్కులను కాలరాస్తున్న అప్పటి కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గా కొనసాగిన సమయంలో ఆయన ప్రభుత్వం మెడలు వంచి కార్మికుల కోసం



అనేక చట్టాలు తెచ్చినా ఘనత ఆయనకే దక్కుతుంది అని అన్నారు. కామ్రేడ్ ఏ.బీ.బర్ధన్ గారి ఆశయాలను అనుసరించడమే నేటి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి లే అని అన్నారు.

## లౌకిక పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు

### భూమ బ్రహ్మానందరెడ్డి

నంద్యాల సెప్టెంబర్ 25, ( విభారె)–, నంద్యాల పట్టణంలో శనివారం నాడు తెలుగుదేశం పార్టీ కి చెందిన పలువురు కౌన్సిలర్లు .లౌకిక పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహారదీక్షలు 10వ రోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యులు భూమా బ్రహ్మానందరెడ్డి గారి ఆదేశానుసారం కౌన్సిలర్లు , ఇంచార్జీ లు దీక్షలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా పెంచిన విద్యుత్ చార్జీలను, వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. వారిని పలువురు అభినందించారు.

## 'పుష్ప' కోసం ట్రెండీ సింగర్



అల్లు అర్జున్.. సుకుమార్ ల కాంబినేషన్ లో రూపొందుతున్న పుష్ప సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ఈయన ఇప్పటికే మొదటి పాటను విడుదల చేశాడు. మాస్ మసాలా సాంగ్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చిన దేవిశ్రీ ప్రసాద్ రెండవ పాటను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. రెండవ పాట మాస్ గా కాకుండా మెలోడీగా ఉంటుందని అంటున్నారు. సుకుమార్ మరియు దేవి శ్రీ ప్రసాద్ ల కాంబోలో ఇప్పటి వరకు వచ్చిన సినిమాలు మంచి మ్యూజికల్ హిట్స్ గా నిలిచాయి. ఇప్పుడు పుష్ప కూడా ఖచ్చితంగా మ్యూజికల్ హిట్ గా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఉన్నారు. టాలీవుడ్ లో పుష్ప తో మరోసారి సుకుమార్ దేవిశ్రీలు సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయం అని మొదటి సాంగ్ తోనే తేలిపోయింది. అతి త్వరలో రెండవ పాటను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈమద్య కాలంలో ట్రెండ్ అవుతున్న పాటల్లో ఎక్కువ శాతం పాడింది సిద్ద్ శ్రీరామ్. అతడు బన్నీ గత చిత్రం అల వైకుంఠపురంలో పాడిన పాట భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే సెంటిమెంట్ తో పుష్ప పార్ట్ 1 లో కూడా అతడితో పాడించాలని భావిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఇప్పటికే అతడితో ట్రావెల్ అవుతున్నాడట. పుష్ప కోసం సిద్ద్ తో ఒక అద్భుతమైన మెలోడీని దేవి శ్రీ ప్రసాద్ పాడించాడని.. ఇద్దరి కాంబోలో రాబోతున్న ఈ మెలోడీ మరో లెవల్ లో ఉంటుందని అంటున్నారు. సామజవరగమనా.. పాటను మించిన మెలోడీ అన్నట్లుగా పుష్ప లో సిద్ పాడబోతున్న పాట ఉంటుందని అభిమానులు చాలా నమ్మకంతో ఉన్నారు. దసరా లేదా కాస్త ముందుగానే పుష్ప నుండి రెండవ పాట విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి.సుకుమార్ ఈ సినిమా ను డిసెంబర్ లో క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్న విషయం తెల్సిందే. భారీ ఎత్తున అంచనాలున్న పుష్ప పార్ట్ 1 ను పాన్ ఇండియా రేంజ్ లో విడుదల చేస్తున్నారు. మొదటి పాటను అయిదు భాషలకు అయిదుగుర సింగర్స్ ను తీసుకున్నారు. మరి రెండవ మెలోడీ సాంగ్ ను సిద్ తోనే అన్ని భాషల్లో పాడిస్తారా లేదంటే దాన్ని కూడా అయిదుగురు సింగర్స్ తో పాడిస్తారా అనేది చూడాలి. భారీ ఎత్తున అంచనాలున్న పుష్ప రెండవ సాంగ్ కు సంబంధించిన అప్ డేట్ అతి త్వరలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల మేకర్స్ అనఫిషియల్ గా సోషల్ మీడియా ద్వారా హింట్ ఇచ్చారు. కనుక కన్ఫర్మ్ గా పుష్ప రెండవ పాటను పాడబోతున్నది సిద్ అని మీడియా వర్గాల వారు చెబుతున్నారు.

## రూ. 5 కోట్లతో మహేష్ కోసం త్రివిక్రమ్..!

ఒకప్పుడు సినిమాల సెట్టింగ్స్ అంటే లక్షల్లో ఉండేవి. కొన్ని సినిమాల్లో అసలు సెట్టింగ్స్ అనేవి కనిపించేవి కాదు. స్టార్ హీరోల సినిమాల్లో కూడా సెట్టింగ్స్ ఉండేవి కాదు. కాని ఇప్పుడు చిన్న హీరోల సినిమాలకు కూడా కోట్ల రూపాయలతో సెట్టింగ్ లను కలిగి ఉంటున్నాయి. సినిమాల్లో రిచ్ నెస్ కోసం భారీగా సెట్టింగ్స్ ను వేయిస్తున్నారు. విదేశాలకు చెందిన లొకేషన్స్ ను కూడా హైదరాబాద్ లో రీ క్రియేట్ చేస్తున్న రోజులు ఇవి. స్టార్ హీరోల సినిమాల్లో ఏదైనా ప్రదేశం లేదా ప్రాంతం ఎక్కువ సమయం కనిపిస్తుంది అంటే కోట్ల రూపాయలతో వాటిని నిర్మించేందుకు సిద్దం అవుతారు. బాహుబలి సినిమా కోసం జక్కన్న మహిష్మతి సాంమ్రాజ్యంనే క్రియేట్ చేసిన విషయం తెల్సిందే. ఆ తర్వాత వచ్చిన.. వస్తున్న సినిమాల్లో అంతకు మించి ఖర్చు చేస్తున్న మేకర్స్ కూడా ఉన్నారు. ఇప్పుడు మహేష్ బాబు తో తెరకెక్కించబోతున్న సినిమా కోసం దర్శకుడు త్రివిక్రమ్ ఏకంగా అయిదు కోట్లతో సెట్టింగ్ ను నిర్మిస్తున్నట్లుగా సమాచారం అందుతోంది.సినిమాలో మెజార్టీ పార్ట్ ఒక ఇంట్లో షూటింగ్ జరుగుతుందట. ఆ షూటింగ్ కోసం త్రివిక్రమ్ ప్రస్తుతం రూ.5 కోట్లు ఖర్చు చేసి మరీ సెట్టింగ్ వేయిస్తున్నాడట. ఆ సెట్టింగ్ అద్బుతంగా వస్తుందంటూ యూనిట్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. అక్టోబర్ లేదా నవంబర్ నుండి షూటింగ్ అక్కడే ప్రారంభం అవుతుందని.. హైదరాబాద్ శివారు ప్రాంతంలో



నిర్మాణం జరుగుతున్న ఆ సెట్టింగ్ కోసం ప్రముఖ ఆర్ట్ డిపార్ట్మెంట్ వర్క్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. భారీ ఎత్తున అంచనాలున్న ఈ సినిమా కోసం హీరోయిన్ గా పూజా హెగ్డేను ఎంపిక చేసినట్లుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు సినిమా యూనిట్ సభ్యుల నుండి అధికారికంగా క్లారిటీ ఇవ్వలేదు. తమన్ ఈ సినిమాకు స్వరాలను అందించబోతున్నాడని తెలుస్తోంది.అల వైకుంఠపురంలో వంటి భారీ బ్లాక్ బస్టర్ సినిమాను తెరకెక్కించిన దర్శకుడు త్రివిక్రమ్ కరోనా కారణంగా దాదాపుగా రెండేళ్ల గ్యాప్ తీసుకుని ఈ సినిమాను ప్రారంభించబోతున్నాడు. ఈ సినిమా కోసం మహేష్ బాబు.. త్రివిక్రమ్ అభిమానులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వీరి కాంబోలో గతంలో వచ్చిన అతడు మరియు ఖలేజా సినిమాలు మంచి ఫలితాన్ని సాధించాయి. రెండు కూడా బాక్సాఫీస్ వద్ద విజయాన్ని సొంతం చేసుకోకున్నా కూడా ప్రేక్షకులు ఎప్పటికి గుర్తుంచుకునే సినిమాలుగా నిలిచాయి. అందుకే ఈ సినిమా కోసం అభిమానులు వెయిట్ చేస్తున్నారు. అతడే పార్థు అనే టైటిల్ ను ఈ సినిమాకు అనుకుంటున్నారనే వార్తలు వస్తున్నాయి. మొత్తానికి ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ లో లేదా దసరాకు బాక్సాఫీస్ ను షేక్ చేయడం ఖాయం అంటున్నారు.

## శ్రీలీల మరో కృతి శెట్టి అవ్వబోతుందా?

ఉప్పెన సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి శెట్టి. మొదటి సినిమా విడుదలకు ముందే కృతి శెట్టికి మంచి ఆఫర్లు వచ్చాయి. ఆమె భారీ ఎత్తున అవకాశాలను దక్కించుకోవడంతో పాటు తన పారితోషికం మొదటి సినిమాకు పది లక్షలు తీసుకుని ఇప్పుడు కోటి రూపాయలకు పైగా పారితోషికంను తీసుకుంటుంది. మొదటి సినిమా విడుదల అయ్యి ఏడాది కూడా కాకుండానే కృతి శెట్టి కోటి పారితోషికం దక్కించుకుంది. ప్రస్తుతం ఆమె చేతిలో అయిదు ఆరు సినిమాలు ఉన్నాయి. ఇంకా కొన్ని చర్చల దశలో ఉన్నాయి. మొత్తానికి కృతి శెట్టి టాలీవుడ్ లో యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ గా మారిపోయింది. వచ్చే ఏడాది ఈమె నటించిన సినిమాలు రెండు మూడు విడుదల అయినా కూడా స్టార్ హీరోల నుండి కూడా ఈమెకు పిలుపు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కృతి శెట్టి ఎలా అయితే టాలీవుడ్ లో వరుసగా సినిమాలు చేస్తోందో అదే దారిలో శ్రీలీల కూడా మొదటి సినిమా విడుదల అవ్వకుండానే బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు దక్కించుకుంటుంది.పెళ్లిసందఆ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కన్నడ బ్యూటీ శ్రీలీలా పరిచయం అవ్వబోతుంది. శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా పరిచయం అవుతున్న పెళ్లిసందఆ లో శ్రీలీలా



హీరోయిన్ గా నటిస్తూ ఉంది. ఇప్పటికే విడుదల అయిన పాటలు మరియు టీజర్ ట్రైలర్ తో శ్రీలీలా అందరి దృష్టిని ఆకర్షించింది. తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యే ఫేస్ అవ్వడంతో పాటు ఆమె మంచి అందం మరియు ప్రతిభ కలిగిన అమ్మాయి అంటూ రాఘవేంద్ర రావు నుండి కితాబు పొందింది. అందుకే ఆమెకు తెలుగు యంగ్ హీరోలు వరుసగా ఆఫర్లు ఇచ్చేందుకు సిద్దం అవుతున్నారు. పలువురు దర్శకులు ఆమెతో టచ్ లోకి వెళ్లారు అంటూ వార్తలు వస్తున్నాయి. రవితేజ హీరోగా రూపొందబోతున్న త్రినాథరావు నక్కిన సినిమాలో హీరోయిన్ గా శ్రీలీలను ఎంపిక చేశారనే వార్తలు వస్తున్నాయి.వీరిద్దరి కాంబోలో మాస్ మసాలా ఎంటర్ టైనర్ మూవీ గత ఏడాదిలోనే పట్టాలెక్కాల్సి ఉన్నా కూడా కరోనా ఇతర కారణాల వల్ల ఆలస్యం అయ్యింది. ఎట్టకేలకు రవితేజ తన కమిటెడ్ ప్రాజెక్ట్ లను పూర్తి చేశాడు. శ్రీలీల హీరోయిన్ గా రవితేజకు జోడీగా దాదాపుగా కన్ఫర్మ్ అయ్యిందని సమాచారం అందుతోంది. ఆమె ను టాలీవుడ్ లో మరింత మంది దర్శకులు మరియు హీరోలు కోరుతున్నారని టాక్ వినిపిస్తుంది. శ్రీలీలా ముందు ముందు టాలీవుడ్ లో మోస్ట్ బిజీ హీరోయిన్ గా మారిపోవడం ఖాయం అంటున్నారు. టాలీవుడ్ లోనే కాకుండా ఇతర భాషల్లో కూడా ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయబోతున్నట్లుగా తెలుస్తోంది. ఉప్పెన హీరోయిన్ కృతి శెట్టి కనుక ఎలా అయితే మొదటి సినిమాతో ఒక్కసారిగా స్టార్ అయ్యిందో అలాగే శ్రీలీలా కూడా మొదటి సినిమాతోనే స్టార్ గా ఎదగబోతున్నట్లుగా విశ్లేషకులు చెబుతున్నారు.

## వృద్ధిమాన్ సాహా ఓపెనర్‌గా పనికిరాడు: దక్షిణాఆఫ్రికా కోచ్

ఐపీఎల్ 2021 లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుస అపజయాలతో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. దీంతో ప్లేఆఫ్ అవకాశాలు దాదాపు ముగిసాయి. అయితే ఐపీఎల్ సెకెండ్ ఫేజ్‌కు ఆ జట్టు స్టార్ ఓపెనర్ జానీ బెయిర్‌స్టో దూరమయ్యాడు. ఈ క్రమంలో ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో డేవిడ్ వార్నర్‌తో కలిసి వృద్ధిమాన్ సాహా హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఆరంభించాడు. అయితే వృద్ధిమాన్ సాహా ఇన్నింగ్స్‌ను ఆరంభించడంపై దక్షిణాఆఫ్రికా కోచ్ మార్క్ బౌచర్ ఆసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మూడు మ్యాచ్‌ల్లో ఓపెనర్‌గా వచ్చిన సాహా వరుసగా 7,1,18, పరుగుల మాత్రమే సాధించాడు."వృద్ధిమాన్ సాహా వాస్తవానికి మంచి వికెట్ కీపర్ కమ్ బ్యాట్సమన్. అయితే సాహా ఓపెనింగ్‌లో ఎక్కువగా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడు. తన బ్యాటింగ్ ఆర&ధర్‌లో మార్పు చేస్తే అతడు అధ్భుతంగా ఆడగలడు" అని ఓ క్రికెట్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా చెప్పాడు.



### డివిలియర్స్ కెప్టెన్ కాలేడు.. ఆ ముగ్గురికే చాన్స్

ఐపీఎల్ 2021 తర్వాత విరాట్ కోహ్లి ఆర్‌సీబీ కెప్టెన్సీ పదవి నుంచి పక్కకు తప్పుకోనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ఇప్పటికే కోహ్లి కెప్టెన్సీ విషయాన్ని ట్విటర్ ద్వారా తెలిపాడు. అయితే కోహ్లి తర్వాత ఆర్‌సీబీకి కెప్టెన్ ఎవరు వ్యవహరిస్తే బాగుంటుందనే దానిపై టీమిండియా మాజీ క్రికెటర్.. క్రికెట్ ఎక్స్‌పర్ట్ సంజయ్ మంజ్రేకర్ స్పందించాడు."కోహ్లి పక్కకు తప్పుకున్న తర్వాత ప్రస్తుతం వైస్‌కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఏబీ డివిలియర్స్‌కు కెప్టెన్ అయ్యే అవకాశాలు లేవు. అతను జట్టును సరైన రీతిలో నడిపించలేడు. అంతేగాక వచ్చే ఐపీఎల్‌లో అతను ఆడే చాన్సులు కూడా చాలా తక్కువ. నా దృష్టిలో పొలార్డ్ ఆర్‌సీబీ కెప్టెన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. వచ్చే వేలంలో అతను ముంబై ఇండియన్స్‌ను నుంచి రిలీవ్ అయితే మాత్రం ఆర్‌సీబీ అతని కొనుగోలుపై ఆసక్తి చూపుతుంది. అంతేగాక ఐపీఎల్‌లో రోహిత్ శర్మ గైర్హాజరీలో పలుమార్లు కెప్టెన్‌గా వ్యవహరించిన పొలార్డ్ ముంబైకి మంచి విజయాలు అందించాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**